ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
భద్రాద్రి కొత్తగూడెం
BHADRADRI KOTHAGUDEM
ఆదివారం, 24 మార్చి 2024
5





	గరిష్ఠం	కనిష్ఠం
ఖమ్మం	38	25
భద్రాద్రి	38	24

రంజాన్‌మాసం



ఇఫ్తార్ (సా) : 6:26 (ఆదివారం)
సహర్ (ఉ) : 4:47 (సోమవారం)

జిల్లాలోని వ్యవసాయ మార్కెట్ కమిటీల ఆదాయాలు టాప్ గేర్‌లో దూసుకుపోతున్నాయి. మార్కెట్ కమిటీలకు ఈ ఏడాది రాష్ట్ర మార్కెటింగ్ శాఖ నిర్దేశించిన మార్కెట్ ఆదాయం టార్గెట్‌ను నూటికి నూరు శాతం లక్ష్యాన్ని ఛేదించే దిశగా మార్కెట్ కమిటీలు దూసుకెళ్తున్నాయి. జిల్లాలో ప్రధానంగా ఖమ్మం, మధిర, నేలకొండపల్లి, కల్లూరు, వైరా, ఏన్కూరు, సత్తుపల్లి, మద్దులపల్లి తదితర 8 మార్కెట్ కమిటీలకు 2023-2024 సంవత్సరానికి గాను రాష్ట్ర మార్కెటింగ్ శాఖ రూ. 54.39 కోట్ల మార్కెట్ ఆదాయాన్ని సమకూర్చాలని టార్గెట్‌గా నిర్దేశించింది.



- ఇప్పటివరకు రూ.51 కోట్ల వసూలు
- లక్ష్యాన్ని దాటిన వైరా, కల్లూరు, సత్తుపల్లి, ఏన్కూరు కమిటీలు
- ఖమ్మం మార్కెట్‌కు రూ.22.76 కోట్ల ఆదాయం
- నెలాఖరుకల్లా మొత్తం టార్గెట్‌ను ఛేదించే దిశగా మార్కెట్లు
- ఓవరాల్‌గా ఇప్పటివరకు 94శాతం ఫీజు ఖజానాకు
- క్రయ విక్రయాలపై 1శాతం ఫీజుతోనే అత్యధిక ఆదాయం

వ్యవసాయ మార్కెట్ల హవా

మార్కెటింగ్ శాఖ టార్గెట్ మేరకు ఆదాయార్జన

మార్కెట్ కమిటీలు-ఆదాయ వివరాలు (మార్చి 20 వరకు)

మార్కెట్ కమిటీలు	లక్ష్యం (కోట్లల్లో)	ఆదాయం (కోట్లల్లో)
ఖమ్మం	26.14	22.76
మధిర	4.34	4.18
నేలకొండపల్లి	4.05	3.44
కల్లూరు	4.17	4.81
వైరా	4.72	5.68
ఏన్కూరు	4.14	4.24
సత్తుపల్లి	3.75	4.62
మద్దులపల్లి	3.08	1.23

ఖమ్మం మార్కెట్, మార్చి 23: జిల్లాలోని మార్కెట్ కమిటీలు సీజన్ ప్రారంభంలో కొంత తడబడినప్పటికీ ఇప్పటి వరకు రూ.51 కోట్ల ఆదాయాన్ని రాబట్టుకోవడం విశేషం. కాగా ఈ ఏడాది ఆర్థిక సంవత్సరం ముగిసే మార్చి 31నాటికి ఇంకా రావాల్సిన మొత్తం రూ.3.39కోట్ల లక్ష్యాన్ని సులువుగానే సమకూర్చుకునే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. మార్కెట్లకు ముఖ్యంగా యార్డులలో జరిగే క్రయవిక్రయాలపై కేవలం 1శాతం ఫీజు వసూలుతోనే అత్యధిక ఆదాయం సమకూరుతుంది. అంతేకాకుండా మార్కెటింగ్ శాఖకు అనుబంధంగా ఉన్న జిన్నింగ్ మిల్లులు, రైస్‌మిల్లులు, వ్యవసాయ చెక్‌పోస్టులు, శీతలగిడ్డంగులు, ధాన్యం, కూరగాయల మార్కెట్‌లతోపాటు పేపర్ మిల్లులకు వెళ్లే సుబాబుల్, జామాయిల్ రవాణాపై సైతం మార్కెట్ ఫీజు మార్కెట్ ఖజానాకు చేరుతుంది.

లక్ష్యాన్ని దాటిన నాలుగు కమిటీలు

జిల్లాలోని వ్యవసాయ మార్కెట్ కమిటీలకు నిర్దేశించిన ఆదాయం టార్గెట్ మేరకు సత్తుపల్లి, వైరా, కల్లూరు మార్కెట్ కమిటీలు లక్ష్యాన్ని దాటి ఎక్కువ ఆదాయాన్ని సమకూర్చాయి. సత్తుపల్లి మార్కెట్‌కు ఈ ఏడాది నిర్దేశించిన రూ.3.75 కోట్లకు గాను రూ.4.62 కోట్లు, వైరా మార్కెట్ కమిటీకి నిర్దేశించిన రూ.4.72 కోట్లకు గాను రూ. 5.68 కోట్లు, కల్లూరు మార్కెట్‌కు నిర్దేశించిన రూ.4.17 కోట్లకు గాను రూ. 4.81 కోట్లు, ఏన్కూరు మార్కెట్ కమిటీకి నిర్దేశించిన రూ.4.14 కోట్లకు గాను రూ. 4.24 కోట్లు అదనంగానే ఆదాయం సమకూర్చుకున్నాయి. కాగా ఆయా మార్కెట్ కమిటీలు ఈ నెలాఖరు కల్లా మరికొంత ఆదాయాన్ని సమకూర్చుకోవచ్చని అధికారులు చెబుతున్నారు.

టార్గెట్‌ను మించి ఆదాయం వచ్చే అవకాశం

ఎం.ఏ.అలీం, ఇన్‌చార్జ్ డీఎంవో



ఈ ఏడాది రాష్ట్ర మార్కెటింగ్ శాఖ జిల్లాలోని ఎనిమిది మార్కెట్ కమిటీలకు నిర్దేశించిన టార్గెట్‌ను మించి మరింతగా ఆదాయం సమకూర్చుకునే అవకాశం ఉంది. ఈ యేడు జిల్లాలో సాగైన మిర్చి పంట తెగుళ్లతో దిగుబడి తగ్గినా.. మిగతా పంటల దిగుబడులు బాగున్నాయి. అంతేకాకుండా మిర్చి ధరలు క్వింటాలుకు రూ.17వేల నుంచి రూ.20 వేల వరకు దక్కుతుండటంతో మార్కెట్ల ఆదాయం లక్ష్యాన్ని చేరుకుంటున్నాయి. ఇంకా మార్కెట్ కమిటీల ఆదాయం పెంచడానికి చర్యలు తీసుకుంటున్నాం.

నెలాఖరు కల్లా టార్గెట్ రీచ్

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు ఈ ఏడాది నిర్దేశించిన టార్గెట్ ఆదాయం రూ.26.14 కోట్లకు గాను ఇప్పటివరకు రూ.22.76 కోట్లు వసూలు చేసింది. మిగతా సుమారు రూ. 4కోట్లను ఈ నెల 31కల్లా సమకూర్చుకోగలుగుతామని అధికారులు పేర్కొంటున్నారు. అంతేగాకుండా మద్దులపల్లి మార్కెట్, మధిర, నేలకొండపల్లి మార్కెట్ కమిటీలు సైతం వారి వారి ఆదాయ టార్గెట్‌లకు దగ్గరలో ఉన్నాయి.





ఇఫ్తార్ విందులో మంత్రి తుమ్మల

భిన్నత్వంలో ఏకత్వం భారతదేశ గొప్పతనమని, హిందూ ముస్లింలు అన్నదమ్ముల వలే కలిసి జీవిస్తున్నారని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఖమ్మం కాల్వొడ్డులోని మదర్సాలో శనివారం నిర్వహించిన ఇఫ్తార్‌విందులో తుమ్మల పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లింలకు అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ముస్లిం పెద్దలకు ఖర్జూరాలు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు.

-ఖమ్మం సంక్షేమ విభాగం



రాస్తారోకో చేస్తున్న వామపక్షాల నాయకులు

మోదీ తీరు అప్రజాస్వామికం

- కేజ్రీవాల్ అరెస్టు కక్ష సాధింపు చర్య
- రాస్తారోకోలో వామపక్షాల నేతలు

ఖమ్మం సంక్షేమవిభాగం, మార్చి 23: ప్రజాస్వామ్యాన్ని ప్రధాని నరేంద్రమోదీ ఖూనీ చేస్తున్నారని, ప్రశ్నించే ప్రతిపక్ష నాయకులు, పార్టీలపై అక్రమ కేసులు బనాయించి రాజకీయంగా లబ్ధిపొందేందుకు రాజకీయాలు చేస్తున్నారని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు ఆరోపించారు. ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ అరెస్టుకు నిరసనగా శనివారం ఖమ్మంలో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. సీపీఐ, సీపీఎం, సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ పార్టీల ఆధ్వర్యంలో పాత బస్టాండ్ సెంటర్‌లో రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మూడోసారి బీజేపీ అధికారంలోకి వచ్చేందుకు మోదీ అ ప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అవినీతి ఉన్నా అక్కడ ప్రజాప్రతినిధులను ఎందుకు అరెస్టులు చేయటం లేదని ప్రశ్నించారు. రాజ్యాంగ స్ఫూర్తితో ఏర్పాటైన ప్రభుత్వ రంగ సంస్థలను బీజేపీ జేబు సంస్థలుగా వాడుకుంటుందని ఆరోపించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, సీపీఎం ఇన్‌చార్జ్ కార్యదర్శి యర్రా శ్రీకాంత్, మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి గోకినెపల్లి వెంకటేశ్వర్లు, నాయకులు పోటు కళావతి, సీతామహాలక్ష్మి, మేకల శ్రీనివాసరావు, దొండపాటి రమేశ్, పగడాల మల్లేష్, తాటి నిర్మల పాల్గొన్నారు.



పల్లెల్లో పడకేసిన పన్నుల వసూళ్లు

- గ్రామ పంచాయతీల్లో నత్తనడకన ప్రక్రియ
- ఖమ్మం జిల్లాలో ఇప్పటివరకు 53శాతమే
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 95శాతం
- ఇంకా వసూలు చేయాల్సినవి రూ.10.16కోట్లు
- ఖమ్మం రూరల్ మండలంలో అత్యధికంగా రూ.4.54కోట్లు

ఖమ్మం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గడువు ముంచుకొస్తున్నా గ్రామ పంచాయతీల పన్నుల వసూళ్ల లక్ష్యం ఆశించిన మేర నెరవేరడం లేదు. ఈ నెల 31న ఆర్థిక సంవత్సరం ముగుస్తుండగా, పన్నుల వసూళ్లకు కూడా అదే రోజును తుదిగడువుగా నిర్దేశించారు. ఖమ్మం జిల్లాలో 589 గ్రామ పంచాయతీలుండగా ఇప్పటివరకు పన్నుల వసూళ్లు 53 శాతం వరకే జరిగింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మాత్రం 95శాతం వసూలు జరగడం గమనార్హం. గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది వివిధ పథకాల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో తలమునకలు కావడం, అలాగే లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన ప్రక్రియలో సహకరించడం వంటి పనుల కారణంగా పన్నుల వసూళ్లు వేగవంతం కాలేదు. దీనికి తోడు రాజకీయ కారణాలతో కొన్ని గ్రామాల్లో స్వచ్ఛందంగా పన్నులు కట్టే పరిస్థితి లేదు. జిల్లాలో మొత్తం పంచాయతీల్లో రూ.21.46కోట్లు వసూలు చేయాల్సి ఉండగా ఇప్పటివరకు రూ.11.29 కోట్లు వసూలు చేశారు. ఇంకా రూ.10.16కోట్లు బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఈ బకాయిల్లో రూ.4.45కోట్లు పాత బకాయిలు కాగా, రూ.5.71 కోట్లు ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించినవి.

తల్లాడ మండలంలో ఇంకా రూ.22.57లక్షలు, ఎర్రుపాలెంలో రూ.16.43 లక్షలు, కల్లూరులో రూ.34.40 లక్షలు, పెనుబల్లిలో రూ.21.88 లక్షలు, వైరాలో రూ.11.91 లక్షలు, సత్తుపల్లిలో రూ.28.67 లక్షలు, చింతకానిలో రూ.23.97 లక్షలు, కూసుమంచిలో రూ.32.54 లక్షలు, రఘునాథపాలెంలో రూ.34.16 లక్షలు, వేంసూరులో రూ.25.93 లక్షలు, బోనకల్‌లో రూ.15.03లక్షలు, కొణిజర్లలో రూ.26.07 లక్షలు, ముదిగొండలో రూ.38.95 లక్షలు, సింగరేణిలో రూ.22.67 లక్షలు, ఏన్కూరులో రూ.26.41లక్షలు, తిరుమలాయపాలెంలో రూ.33.67 లక్షలు, నేలకొండపల్లిలో రూ.78.37 లక్షలు, కామేపల్లిలో రూ.16.20 లక్షలు, ఖమ్మం రూరల్ రూ.4.54 కోట్లు, మధిరలో రూ.52.18 లక్షలు బకాయిలున్నాయి. అత్యధికంగా ఖమ్మం రూరల్ మండలంలోని పంచాయతీలో పన్నులు వసూలు కావాల్సి ఉంది.

ఇక భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 481 గ్రామ పంచాయతీలకుగాను ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.15.29 కోట్లు లక్ష్యం కాగా, ఇప్పటివరకు రూ.14.54కోట్లు వసూలు జరిగింది. ఇంకా రూ.1.06 కోట్ల బకాయి ఉంది. 481 పంచాయతీల్లో 95శాతం పన్నులు వసూలయ్యాయి. పది గ్రామ పంచాయతీల్లోనే ఇంకా ఆరుశాతం పన్నుల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. ఏజెన్సీ ప్రాంతం అయినా పన్నుల వసూళ్లలో భద్రాద్రి జిల్లా ఖమ్మం జిల్లా కంటే ముందంజలో ఉంది.

పన్నుల వసూళ్లపై దృష్టి పెట్టాం : హరికిషన్, జిల్లా పంచాయతీ అధికారి



జిల్లాలో గ్రామ పంచాయతీ పన్నుల బకాయిలపై దృష్టిపెట్టాం. కార్యదర్శులందరికి నూరుశాతం పన్నులు వసూలు చేయాలని ఆదేశాలు జారీ చేశాం. అయితే ఖమ్మం రూరల్ మండలంలోనే పన్నుల బకాయి ఎక్కువగా ఉంది. జిల్లాలో పాత బకాయిలు కూడా రూ.4.52కోట్ల వరకు ఉన్నాయి. ఈ నెలాఖరుకే ఎక్కువశాతం పూర్తిచేయాలని లక్ష్యం పెట్టుకున్నాం. అయితే పంచాయతీ కార్యదర్శులకు పలు రకాల విధులతో అనుకున్న లక్ష్యాన్ని చేరుకోలేకపోయాం. జూన్ నాటికి పూర్తిపన్నులు వసూలయ్యేలా చూస్తాం.

భద్రాద్రి రామయ్యకు పెళ్లి కళ

- రేపు డోలోత్సవం, వసంతోత్సవం
- నేడు అంకురార్పణ

భద్రాచలం, మార్చి 23: హోలీ పౌర్ణమిని పురస్కరించుకొని భద్రాద్రి రామయ్యకు సోమవారం డోలోత్సవం, వసంతోత్సవం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాల కోసం ఆదివారం అంకురార్పణ చేయనున్నారు. దేవస్థానం ఆధ్వర్యంలో ఏప్రిల్ 9నుంచి 23వరకు శ్రీరామనవమి నవాహ్నిక తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. కాగా ఏప్రిల్ 17న స్వామివారికి కల్యాణం నిర్వహించనున్నారు. కాగా హోలీ పౌర్ణమిని పురస్కరించుకొని స్వామివారికి సోమవారం సహస్రధారతో ప్రత్యేక స్నపనం నిర్వహించనున్నారు. అనంతరం స్వామివారిని ఉయ్యాల్లో ఆసీనులను చేసి డోలోత్సవం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా రామదాసు, తూము నరసింహదాసు



కీర్తనలను ఆస్థాన గాయకులు ఆలపిస్తుండగా నక్షత్ర, కుంభ హారతులను స్వామివారికి సమర్పించనున్నారు. హోలీని పురస్కరించుకొని ముందుగా ప్రధాన ఆలయంలోని ధ్రువమూర్తులకు, ఆంజనేయస్వామికి, లక్ష్మీతాయారు అమ్మవారికి వసంతాన్ని శాస్త్రోక్తంగా చల్లి భక్తులపై వసంతోత్సవ కార్యక్రమానికి చిహ్నంగా పసుపు నీళ్లను చల్లుతారు. దీన్నే వసంతోత్సవంగా పేర్కొంటారు. అలాగే సాయంత్రం స్వామివారికి తిరువీధిసేవ నిర్వహిస్తారు. డోలోత్సవం, వసంతోత్సవం నిర్వహించిన రోజు భద్రాద్రి రామయ్యను పెళ్లికుమారుడిగా చేసినట్లుగా భావిస్తారు. రామయ్య కల్యాణ తలంబ్రాల తయారీకి సోమవారం శ్రీకారం చుట్టనున్నారు. ఈ క్రమంలో 25న స్వామివారికి నిత్యకల్యాణం ఉండదు.



రవాణాశాఖకు ఆన్‌లైన్ ఇక్కట్లు

ఖమ్మం సంక్షేమవిభాగం, మార్చి 23: జిల్లా రవాణా శాఖ కార్యాలయానికి శనివారం ఆన్‌లైన్ ఇబ్బందులు వచ్చాయి. కార్యాలయానికి వచ్చే ఇంటర్‌నెట్ వైర్లు తెగిపోవటంతో ఆన్‌లైన్ సమస్య ఏర్పడింది. దీంతో వాహనాల రిజిస్ట్రేషన్లు, లైసెన్స్‌ల కోసం వచ్చిన వాహనదారులు ఇక్కట్లుపడ్డారు. కార్యాలయంలోని కౌంటర్ల వద్ద ఫొటోలు దిగేందుకు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నిరీక్షించారు. చివరకు మంగళవారానికి వాయిదా వేయటంతో మరోసారి స్లాట్‌లకు మార్చుకోవాలని అధికారులు సూచించటంతో వాహనదారులు, లైసెన్స్‌లు కోసం వచ్చిన వారు వెనుదిరిగారు.

రంగు రబ్బ రబ్బ..



- హోలీ వేడుకకు సిద్ధమైన భిన్నవర్గాలు
- హోలీ కార్నివాల్ ప్లానింగ్‌లో యువత
- నేడు, రేపు కొనసాగనున్న వేడుకలు

ఖమ్మం సాంస్కృతికం, మార్చి 23: రంగుల పండుగ హోలీ వేడుకకు నగరం సిద్ధమైంది. ముఖాలకు సంతోషాల రంగులు పులుముకునే పండుగను ఘనంగా జరుపుకొనేందుకు జనం పెద్దఎత్తున ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. బండ్లపై వీధుల్లో తిరుగుతూ స్నేహితుల ఇళ్లకు వెళ్లి వాళ్లను రంగుల్లో ముంచెత్తుతారు. సాధారణ పద్ధతుల్లో ఇళ్ల వద్ద, వీధుల్లోనే కాక రిసార్ట్‌లు, తదితర గేటెడ్ ప్రదేశాల్లో రంగ్ రేవ్, రంగ్‌దే పేర్లతో, హోలీ కార్నివాల్‌లు నిర్వహించేందుకు ఈవెంట్ ప్లానర్లు ఏర్పాట్లు చేశారు.

హోలీ సోమవారం అయినప్పటికీ ఆదివారం అనుకూలమైన రోజు కావటంతో 24వ తేదీనే హోలీ పండుగను జరుపుకొనేందుకు ఈవెంట్ ప్లానర్లు ఏర్పాట్లు చేశారు. సాధారణ రంగులు కాకుండా, లైవ్ డీజేలు, ఆర్గానిక్ రంగులు, రెయిన్ డాన్స్‌లు, ఫోమ్ పార్టీలు, రంగులు నింపిన ఉట్టి కొట్టే ఆటలు, టమాటాలు విసురుకోవటాలు, రంగులు నింపిన బెలూన్లు విసురుకోవటాలు, దాండియా నృత్యాలతోపాటు విందు, వినోదాన్ని అందించనున్నారు. ఈవెంట్ నిర్వాహకులు ఆర్గానిక్ కలర్లను వినియోగించనుండగా నగర వ్యాప్తంగా సాధారణ రంగులు, రంగునీళ్లు, కోడిగుడ్లు, తదితర రకాలుగా హోలీ సంబురాలను ఆస్వాదించే ఆచారం కొనసాగుతోంది. నగరంలోని కమాన్ బజార్, పలు గేటెడ్ కమ్యూనిటీల్లో, అపార్టుమెంట్ల వద్ద సామూహిక హోలీ వేడుకలు జరుపుకోనున్నారు. సోమవారం కూడా హోలీ వేడుకలు కొనసాగనున్నాయి.



ఎదురెదురుగా ద్విచక్ర వాహనాల ఢీ

- ఒకరి మృతి... మరొకరికి తీవ్ర గాయాలు
- గాంధీనగర్ కాలనీ వద్ద ఘటన
- మృతుడు ఎన్టీఆర్ జిల్లా వత్సవాయి వాసి

కులాంతర వివాహం చేసుకుందని..



- కూతురుపై బ్లేడ్‌తో దాడి చేసిన తండ్రి
- నాగినేనిప్రోలు రెడ్డిపాలెంలో ఘటన

6



వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

వేంసూరు, మార్చి 23: కందుకూరులోని శ్రీవేంకటేశ్వరస్వామి వారి కల్యాణాన్ని శనివారం రాత్రి 9.25గంటలకు అత్యంత వైభవంగా నిర్వహించారు. శ్రీపద్మావతి, శ్రీరాజ్యలక్ష్మీ అమ్మవార్ల సమేత శ్రీవేంకటేశ్వరస్వామివారి కల్యాణం నిర్వహించారు. ఆలయ ఈవో నర్సింహారావు ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

భూ అక్రమాలపై విచారణ జరిగేనా..?



» పరాధీనమైన అస్సైన్డ్, ప్రభుత్వ భూములు » భూ స్వాములకు అస్సైన్డ్ భూములు

సత్తుపల్లి, మార్చి23: గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన ధరణి పోర్టల్ అస్తవ్యస్తంగా ఉందని, దీనివలన భూరికార్డుల్లో అక్రమాలు చోటు చేసుకున్నాయని, రూ.వేలకోట్ల భూములు అన్యాక్రాంతం అయ్యాయని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తోంది. ఈ క్రమంలో ధరణి పోర్టల్‌ను సమూలంగా మార్చి, అక్రమాలపై శ్వేతపత్రం కూడా విడుదల చేస్తామని, భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించిన విషయం విదితమే.

ధరణి పోర్టల్‌తో రైతుల ఇబ్బందులు

ఇదే క్రమంలో గత ప్రభుత్వం ధరణి పోర్టల్ ప్రవేశపెట్టడానికి ముందుకు భూమి రికార్డుల ప్రక్షాళన చేసింది. ఈ సందర్భంగా అనేక అక్రమాలు చోటుచేసుకున్నాయి. వీటితో పాటు ప్రభుత్వ అస్సైన్డ్ భూములు కూడా వందలాది ఎకరాలు నిబంధనలకు విరుద్ధంగా బదలాయింపు జరిగింది. ఆంధ్రా రాష్ట్రానికి చెందిన వారికి, భూస్వాములకు కూడా అస్సైన్‌మెంట్ భూములను ధారాదత్తం చేశారనే ఆరోపణలు ఉన్నాయి. వీటికి తోడు పట్టా, సర్వే నెంబర్లతో రిజిస్ట్రేషన్లు చేయించుకుని ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్నారని ఆరోపణలు వెల్లువెత్తాయి. ధరణి పోర్టల్ అందుబాటులోకి వచ్చిన తర్వాత రైతుల సమస్యలు కుప్పతెప్పలుగా పెరిగాయి. అయినా గత అయిదారేళ్ల కాలంలో జరిగిన అక్రమాలపై కనీసం విచారణ జరిపిన అధికారులు లేకపోవడం కొసమెరుపు.

చేతులు మారిన అస్సైన్డ్‌భూములు

భూమి రికార్డుల ప్రక్షాళన అనంతరం ధరణి పోర్టల్‌లోకి భూముల వివరాల నమోదు సమయంలో జిల్లాలో వేలాది ఎకరాల అస్సైన్‌మెంట్ భూములు చేతులు మారాయి. అస్సైన్‌మెంట్ భూములు ఆక్రమించారంటూ గతంలో రాష్ట్రంలో ఓ ప్రముఖ నాయకుడిపై కేసులు కూడా నమోదైన సంఘటనలు ఉన్నాయి.

కానీ ఖమ్మం జిల్లాలో మాత్రం చేతులు మారిన అస్సైన్‌మెంట్ భూములపై కనీస విచారణ జరిగిన సంఘటనలు లేవు. నిరుపేదలకు ప్రభుత్వం పంపిణీ చేసిన వ్యవసాయ భూముల క్రయవిక్రయాలను ప్రభుత్వం నిషేధించింది. దీనికోసం ప్రొహిబిషన్ ఆఫ్ ట్రాన్స్‌ఫర్-1990చట్టం ప్రకారం..అస్సైన్‌మెంట్ భూముల క్రయవిక్రయాలు నిషేదం. భూములు అమ్మినట్లు అధికారుల దృష్టికి వస్తే నిబంధనల మేరకు విచారణ జరిపి పట్టా పొందిన వ్యక్తికి భూమి అవసరం లేకుండా కొనుగోలు చేసిన వ్యక్తి నిరుపేద అయివెంటే ఉన్నతాధికారుల అధికారుల అనుమతితో వారి పేరుతో మార్పు చేయవచ్చు. లేకుంటే సదరు భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాల్సి ఉంది. చట్టం రాకముందు తాము భూములు కొనుగోలు చేసినట్లుగా రికార్డులు సృష్టించి కొందరు అస్సైన్‌మెంట్ భూములు కొందరు కొనుగోలు చేసినట్లు చూపి రికార్డులు మార్చుకున్నారు. అస్సైన్‌మెంట్ పట్టా గతంలో పొందిన యజమాని జీవించి ఉండి వారసులకు తన భూమి పంపిణీ చేయాలని ప్రయత్నించినా ధరణిలో అవకాశం లేదంటూ అధికారులు తిరస్కరించారు. కానీ అక్రమార్కులకు మాత్రం పెద్ద మొత్తంలో అస్సైన్‌మెంట్ భూములను కట్టబెట్టారనే విమర్శలు ఉన్నాయి. దీంతో వేలాది ఎకరాల అస్సైన్‌మెంట్ భూములు పరాధీనమయ్యాయని ఆరోపణలు ఉన్నాయి. గతంలో జిల్లాలోని సత్తుపల్లి, వేంసూరు మండలాల్లో అస్సైన్‌మెంట్ భూములు చేతులు మారినట్లు ఫిర్యాదులు ఉన్నాయి.

సరిహద్దు పట్టా నెంబర్ ముసుగులో ప్రభుత్వ భూముల కబ్జా

ప్రభుత్వ భూములను ఆక్రమించిన పలువురు సరిహద్దున ఉన్న పట్టా సర్వే నెంబర్లతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. పట్టా భూములను ఆనుకుని ప్రభుత్వ భూములు ఉండటంతో పట్టా భూములలో గత ప్రభుత్వం జారీచేసిన పాస్ పుస్తకం మాత్రమే ఉండి స్వాధీనంలో భూమి లేనివారిని గుర్తించి వారితో రిజిస్ట్రేషన్ చేయించుకుని ప్రభుత్వ భూములను అనుభవిస్తున్నారని ఫిర్యాదులు ఉన్నాయి. వీటితో పాటు గెట్టు (సరిహద్దు గ్రామాల) సర్వే నెంబర్లతో కూడా భూములను ఈ రకంగా ఆక్రమించుకున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సత్తుపల్లి మునిసిపాలిటీ పరిధిలోని అయ్యగారిపేట రెవెన్యూ-మండలంలోని కాకర్లపల్లి సరిహద్దు మధ్య ఉన్న ప్రభుత్వ భూములలో సాగు చేసుకుంటున్న వారు పట్టా నెంబర్లతో టైటిల్ పొందినట్లు చెబుతున్నారు.

విచారణతోనే వెలుగులోకి అక్రమాలు

అస్సైన్‌మెంట్, ప్రభుత్వ భూముల వివరాలను పూర్తి స్థాయిలో పరిశీలిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. రెవెన్యూ గ్రామాల వారీగా ప్రభుత్వ భూమి ఎంత ఉంది, అస్సైన్డ్ చేయగా మిగిలిన భూమి ఎంత, మిగిలిన ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందా, అస్సైన్‌మెంట్ భూములు ఎన్ని ఎకరాల పరాధీనమయ్యాయి అనే అంశంపై పూర్తి స్థాయిలో విచారణ జరిపితే అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని ప్రజలు చెబుతున్నారు.

రంగులు మారుస్తున్న అక్రమార్కులు

అక్రమార్కులు అధికార పార్టీ నాయకులను ప్రసన్నం చేసుకుని తమ భూములను కాపాడుకుంటున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. భూములను కాపాడుకునేందుకు రాజకీయ నాయకులను ఆశ్రయించడంతో ఏళ్ల తరబడి ఈ తరహా భూ సమస్యలు కొనసాగుతున్నాయని పలువురు పేర్కొంటున్నారు.

సీపీఆర్ చేసి ప్రాణం కాపాడిన కానిస్టేబుల్

ఇల్లెందురూరల్, మార్చి23: ఎండకు తాళలేక అపస్మారక స్థితిలోకి వెళ్లిన ఓ వ్యక్తికి సీపీఆర్ చేసి ప్రాణం పోశాడు కానిస్టేబుల్. వివరాల ప్రకారం..ఇల్లెందు మండలం కోటిలింగాల క్రాస్ రోడ్డు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గార్ల మండలం కృష్ణాపురానికి చెందిన ఇస్లావత్ కిషన్ అపస్మారక స్థితికి వెళ్లాడు. ఇది గమనించిన పోలీస్ కానిస్టేబుల్ సీఎచ్. నాగరాజు అపస్మారక స్థితిలో ఉన్న కిషన్‌ను సీపీఆర్ చేసి స్పృహలోకి తీసుకొచ్చాడు. వెంటనే ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. వ్యక్తి ప్రాణాలు కాపాడిన కానిస్టేబుల్ నాగరాజును పలువురు అభినందించారు.



సీపీఆర్ చేస్తున్న కానిస్టేబుల్ నాగరాజు

ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

● జిల్లా అదనపు కలెక్టర్ సత్యప్రసాద్

వైరా, మార్చి23: లోక్‌సభ నియోజకవర్గ ఎన్నికల విధుల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, అలసత్వం ప్రదర్శించొద్దని జిల్లా అదనపు కలెక్టర్, వైరా నియోజకవర్గ సహాయ ఎన్నికల అధికారి బి.సత్యప్రసాద్ హెచ్చరించారు. వైరా మునిసిపల్ కార్యాలయంలో శనివారం వైరా నియోజకవర్గ పరిధిలోని సెక్టార్ అధికారులు, ఎంపీడీవోలు, ఇతర పోలింగ్ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ స్టేషన్లలో సరైన సౌకర్యాలు ఉండేలా ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. పోలింగ్ స్టేషన్‌లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో ఏర్పాట్లు చేసే విధంగా పర్యవేక్షణ చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైరా తహసీల్దార్ కేవీ.శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.

పిడియా గుట్టల్లో ఎన్‌కౌంటర్

» ఇద్దరు మావోయిస్టుల మృతి

చర్ల, మార్చి 23: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా పిడియా గుట్టలపై శనివారం ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందినట్లు బీజాపూర్ పోలీసులు తెలిపారు. పిడియా గుట్టలపై మావోయిస్టుల కదలికలు ఉన్న నేపథ్యంలో బీజాపూర్, దంతెవాడ, సుకుమా జిల్లాలకు చెందిన డీఆర్‌జీ, బస్తర్ ఫైటర్స్, కోబ్రా ఇతర జవాన్లు కూంబింగ్ ప్రారంభించారు. ఇదే క్రమంలో పిడియా గుట్టలపై శనివారం ఉదయం ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారు. ఘటనా స్థలం నుంచి తుపాకులు, మావోయిస్టుల సామగ్రిని జవాన్లు స్వాధీనం చేసుకున్నారు.

దంతెవాడలో పేలిన ప్రెజర్ బాంబ్..ఇద్దరు జవాన్లకు గాయాలు

దంతెవాడ అడవుల్లోకి శనివారం తెల్లవారు జామున కూంబింగ్ వెళ్లిన బస్తర్ ఫైటర్స్ చెందిన ఇద్దరు జవాన్లు గాయపడ్డారు. అడవిలోకి వెళ్లిన క్రమంలో మావోయిస్టుల అమర్చిన ప్రెజర్ బాంబ్‌పై జవాన్లు కాలు వేయడంతో, ప్రెజర్ బాంబ్ ఒక్కసారిగా పేలిపోయింది. జవాన్ల కాళ్లు, శరీర భాగాలకు గాయాలయ్యాయి. వెంటనే గాయపడ్డ జవాన్లను హెలీకాప్టర్ ద్వారా రాయిపూర్ తరలించారు. అడవుల్లో గాలింపును ముమ్మరం చేశారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

ఆళ్లపల్లి, మార్చి 23: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆళ్లపల్లి మండలం, పెద్దూరు గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగింది. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని పెద్దూరు గ్రామానికి చెందిన పోలెబోయిన లక్ష్మయ్య(40)కు, కుటుంబ సభ్యులకు మధ్య నిత్యం భూమి ఘర్షణలు జరుగుతుండేవి. ఈ క్రమంలో అతడు మద్యానికి బానిస కావడంతో, తల్లితండ్రులు శుక్రవారం మందలించారు. క్షణికావేశంలో తల్లిదండ్రులను గాయపర్చాడు. దీంతో కొందరు గ్రామస్థులు అలా తల్లిదండ్రులపై ఎందుకు చేయి చేసుకున్నావని మందలించడంతో గడ్డిమందు తాగాడు. గమనించిన ఓ వ్యక్తి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. వెంటనే వారు మృతుడిని చికిత్స నిమిత్తం కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. శనివారం కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఆళ్లపల్లి ఎస్ఐ రతీష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కేబుల్ బ్రిడ్జి అలైన్‌మెంట్ మార్పు కోసం వినతి

ఖమ్మం వ్యవసాయం, మార్చి 23: నగరంలో నిర్మించబోయే కేబుల్ బ్రిడ్జి అలైన్‌మెంట్‌ను స్వల్పంగా మార్చాలని, దానివల్ల కాల్వ ఒడ్డులో ఉన్న కర్మకాండల భవనం, ఇతర భవనాలకు జరిగే నష్టాన్ని తగ్గించవచ్చని హిందూ స్మశాన వాటిక నిర్వహణ కమిటీ కార్యదర్శి అనంత పద్మనాభం, కార్పొరేటర్ కమర్తపు మురళి సమక్షంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కోరారు. ఈమేరకు శనివారం మంత్రికి వినతిపత్రాన్ని సమర్పించారు. ఖమ్మం నేత్రనిధి ద్వారా నెలకు 30 జతలకు పైగా నేత్రాలను సేకరిస్తున్నామని మంత్రికి తెలిపారు. ఖమ్మం కాల్వొడ్డులో గల గ్యాస్ దహన వేదికను కమిటీ వారికి నిర్వహణ అప్పగిస్తే... నేత్రదానం చేసిన వారి భౌతిక కాయాన్ని ఉచితముగా దహనం చేయగలమని తెలిపారు.

ఎదురెదురుగా వాహనాలు ఢీ

● ఒకరి మృతి, మరొకరికి గాయాలు



శేషగిరిరావు మృతదేహం

చింతకాని, మార్చి 23: రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడిన సంఘటన మండల పరిధిలోని గాంధీనగర్ కాలనీ వద్ద శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఎన్టీఆర్ జిల్లా వత్సవాయి గ్రామానికి చెందిన గుర్రం శేషగిరిరావు (55) పని నిమిత్తం ఖమ్మం వచ్చి స్వగ్రామానికి తిరుగు వెళ్తుండగా, బోనకల్ మండలం మోటమర్రికు చెందిన మంద వెంకటరావు స్వగ్రామం నుంచి ఖమ్మం వెళ్తున్నాడు. కాగా వీరి ద్విచక్రవాహనాలు గాంధీనగర్ గ్రామం వద్ద ఎదురెదురుగా బలంగా ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనం ద్వారా ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శేషగిరిరావు మృతి చెందాడు. మరో వ్యక్తి వెంకటరావు పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్లు సమాచారం. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

● లింగాల రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు గాయాలు

ఇల్లెందురూరల్: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్ర గాయలైన సంఘటన మహబుబాబాద్-ఇల్లెందు ప్రధాన రహదారి కోటి లింగాల వద్ద శనివారం జరిగింది. మండలంలోని వేములవాడ గ్రామానికి చెందిన శంకర్, ఒడ్డుగూడెం గ్రామానికి చెందిన ఆరేం సాయి ఇరువురు ద్విచక్ర వాహనంపై ఇల్లెందు నుంచి స్వగ్రామాలకు వెళ్తుండగా కోటి లింగాల క్రాస్ రోడ్డు మూల మలుపు వద్ద అదుపుతప్పి వాహనం పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఇరువురికి తీవ్ర గాయాలుకాగా, 108 ద్వారా మహబుబాబాద్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. శంకర్ పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపినట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు.

కోడిపందేల స్థావరంపై దాడి

దుమ్ముగూడెం మార్చి 23: చింతగుప్ప శివార్లలో శుక్రవారం సాయంత్రం కోడిపందేల స్థావరంపై పోలీసులు దాడి చేసిన సంఘటనపై శనివారం కేసు నమోదు చేశారు. సంఘటనా స్థలం నుంచి ఆరు ద్విచక్రవాహనాలు, రూ3,100ల నగదు, ఐదు కత్తులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. లక్ష్మీనగరం, పాతజిన్నెలగూడెం, గంగోలు గ్రామాలకు చెందిన ముగ్గురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. సీఐ అశోక్, ఎస్ఐలు కేశవరావు, గణేష్ సిబ్బంది ఉన్నారు.

బెల్ట్ షాపులపై పోలీసుల దాడులు

బూర్గంపాడు, మార్చి 23: మండల పరిధిలోని లక్ష్మీపురంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు శుక్రవారం రాత్రి బూర్గంపాడు పోలీసులు దాడులు నిర్వహించారు. మూడు షాపుల్లో రూ.25వేల విలువ చేసే మద్యం స్వాధీనం చేసుకున్నారు.

కూతురుపై తండ్రి దాడి.. కేసు నమోదు

బూర్గంపాడు, మార్చి 23: కన్న కూతురుపై తండ్రి దాడి చేసిన సంఘటనపై శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. సంఘటనకు సంబంధించి పోలీసులు, విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి..

బూర్గంపాడు మండల పరిధిలోని నాగానేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామానికి చెందిన సారిక అదేగ్రామానికి చెందిన యువకుడిని ప్రేమించింది. వారి కులాలు వేరే కావడంతో పెద్దలు అంగీకరించరేమో అని ఇంటినుంచి వెళ్లిపోయి కులాంతర వివాహం చేసుకుంది. అనంతరం అదే ఊరిలో భర్తతో కలిసి ఉంటోంది. ఈ క్రమంలో యువతి తండ్రి యగ్నం నారాయణ శుక్రవారం ఉదయం తన కూతురుతో మాట్లాడాలని వారి ఇంటికి వెళ్లాడు. అక్కడ వారి కుటుంబ సభ్యులతో మాట్లాడే క్రమంలో వాగ్వాదం జరిగింది. కోపంతో నారాయణ తనతో తెచ్చుకున్న బ్లేడ్‌తో కుమార్తెపై దాడి చేశాడు. ఈఘటనలో ఆమె చేతికి గాయమైంది. వెంటనే కుమార్తె అత్తింటివారు, చుట్టుపక్కల వాళ్లు నారాయణను అడ్డుకున్నారు. అనంతరం గాయపడిన సారిక తనపై జరిగిన దాడి విషయమై మరుసటిరోజు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



గవర్నర్‌కు బొకే అందజేస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

గవర్నర్‌ను కలిసిన వైరా ఎమ్మెల్యే

వైరా, మార్చి 23: తెలంగాణ రాష్ట్ర గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టిన సీపీ రాధాకృష్ణన్‌ను వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ శనివారం మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యే కలిసి శుభాకాంక్షలు తెలిపి బొకే అందజేశారు.

తానా సభలకు ఎమ్మెల్యే జారేకు ఆహ్వానం



ఎమ్మెల్యేకు ఆహ్వానం అందజేస్తున్న సీఈవో జ్యోతి

దమ్మపేట, మార్చి23: అమెరికాలో మే 24 నుంచి 26 వరకు జరగనున్న తానా మహాసభలకు రావాల్సిందిగా అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణకు తానా ఆర్గనైజింగ్ సీఈవో జ్యోతిరెడ్డి శనివారం హైద్రాబాద్‌లో కలిసి ఆహ్వానం అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అమెరికాలో అశ్వారావుపేట నియోజకవర్గంలో ఉన్న ఎన్నారైలను కలిసి ఈప్రాంత అభివృద్ధికి వారి సహకారం తీసుకుంటానన్నారు. ఇప్పటికే ఎన్నారైలు అభివృద్ధికి సహకరిస్తామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఎమ్మెల్యేతో పాటు జూపల్లి రమేష్ ఉన్నారు.

రైలు కింద పడి యువకుడి మృతి

ఖమ్మంక్రైం, మార్చి 23: రైలు కిందపడి యువకుడు మృతి చెందిన సంఘటన శనివారం నగర పరిధిలో జరిగింది. రైల్వే స్టేషన్ సమీపంలోని ట్రాక్‌పై సుమారు 25 ఏళ్ల వయస్సున్న గుర్తు తెలియని యువకుడు మృతి చెంది ఉన్నాడని రైల్వే సిబ్బంది జీఆర్పీ పోలీసులకు సమాచారం అందించడంతో వారు సంఘటనాస్థలం వద్దకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అన్నం శ్రీనివాసరావు సహకారంతో మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రి మార్చురికి తరలించారు.

ఇసుక డంప్ సీజ్

అశ్వారావుపేట టౌన్, మార్చి23: అశ్వారావుపేట దివాణం బజారులో అక్రమంగా నిల్వ చేసిన ఇసుకను సమాచారం మేరకు శనివారం రెవెన్యూ అధికారులు పరిశీలించి సీజ్ చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా కొందరు నాలుగు గుట్టలుగా ఇసుకను డంప్ చేశారన్న విషయం తెలుసుకున్న గిర్దావర్ కృష్ణ, సర్వేయర్ నాగరాజులు, ఎస్ఐ శ్రీరాముల శ్రీను ఇసుక డంప్‌ను పరిశీలించారు. ఎలాంటి అనుమతులు లేకపోవడంతో ఇసుకను సీజ్ చేసి స్వాధీనం చేసుకున్నామని వారు తెలిపారు. అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక 106.55 క్యూబిక్ మీటర్లు ఉంటుందని పేర్కొన్నారు. అక్రమంగా ఇసుకను నిల్వ ఉంచిన వారిపైన చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ కృష్ణప్రసాద్ తెలిపారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

కల్లూరు, మార్చి 23: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం కల్లూరు ఆర్డీవో శ్రీనివాస్‌తో పాటుగా మండల రెవెన్యూ అధికారులు పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. మండలంలోని యజ్ఞనారాయణపురం, పాయాపూరు, లింగాల, వాచ్యానాయక్‌తండ, జీడీబీపల్లి గ్రామాల్లో గల పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఆయా కేంద్రాలు పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలపై సమాచారం సేకరించారు. సదరు కేంద్రాలు పోలింగ్ నిర్వహణకు అనువైనవిగా మండల అధికారులు గుర్తించటంతో ఆర్డీవో తుది కసరత్తుగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని సౌకర్యాలను కల్పించాలని సూచించారు. ఓటర్ల ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని పేర్కొన్నారు. ఆయన వెంట తహసీల్దార్ బాబ్జీప్రసాద్, ఆర్ఐ అన్వర్, స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.



యజ్ఞనారాయణపురంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో శ్రీనివాస్

న్యాయవాదులు నిత్య విద్యార్థుల్లా నేర్చుకోవాలి

● ఐఏఎల్ రాష్ట్ర అధ్యక్షుడు సీనియర్ న్యాయవాది పోట్ల మాధవరావు

ఖమ్మం లీగల్, మార్చి 23: న్యాయవాదులు నిత్య విద్యార్థుల్లా నేర్చుకోవాలని ఐఏఎల్ రాష్ట్ర అధ్యక్షుడు సీనియర్ న్యాయవాది పోట్ల మాధవరావు అన్నారు. శనివారం కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాలలో ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్(ఐఏఎల్) జిల్లా అధ్యక్షుడు షేక్ లతీఫ్, ప్రధానకార్యదర్శి ఓరుగంటి శేషగిరిరావు ఆధ్వర్యంలో న్యాయవాదులకు ఏర్పాటు చేసిన శిక్షణా తరగతుల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. కోర్టులలో క్రాస్ ఎగ్జామినేషన్ చేయాలంటే అధ్యయనం చేయాలన్నారు. న్యాయవాదులు కేసు మీద లోతైన అధ్యయనం చేసిన తరువాతనే క్రాస్ ఎగ్జామినేషన్ చేయాల్సిన అవసరం ఉంటుందన్నారు. జూనియర్ న్యాయవాదులు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఏజెన్సీ లా గురించి సీనియర్ న్యాయవాది కాళ్లూరి లక్ష్మీనర్సింహారావు ఆర్ఆఫ్‌క్రాస్ ఎగ్జామినేషన్ ఎలా చేయాలి అనే విషయంపై అవగాహన కల్పించారు. ఏజెన్సీ ప్రాంతంలో ఏజెంట్ కోర్టులు, అసిస్టెంట్ ఏజెంట్ కోర్టుల ద్వారా న్యాయం పొందవచ్చునని అన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో భూ వివాదాలు, విడాకులు తదితర కేసులు ఏజెంట్ కోర్టు ద్వారానే పరిష్కారం అవుతాయని అన్నారు. కార్యక్రమంలో ఐఏఎల్ మహిళా ప్రతినిధి షేక్ నస్రీన్, భద్రాద్రి కొత్తగూడెం అధ్యక్షుడు కె.సత్యనారాయణ, పారుపల్లి అమర్‌చంద్, మేకల నవీన్‌కుమార్, జీ.వి.లక్ష్మీనారాయణ, గాజుల అమర్‌నాథ్, ఆర్.శివారామ్, శరత్ బాబు, ఇమామ్ వలీ, రామాంజనేయులు, రంజిత్ కుమార్, మహేష్ న్యాయవాదులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాధవరావు

డంపింగ్ యార్డుల్లో తడి, పొడి చెత్త సేకరణ చేపట్టాలి

» ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, గ్రామ పంచాయతి ప్రత్యేక అధికారి ప్రతీక్‌జైన్

భద్రాచలం, మార్చి 23: భద్రాచలం పట్టణం, వార్డుల్లో సేకరిస్తున్న తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డుల్లో సిబ్బంది వేసేలా చర్యలు తీసుకోవాలని భద్రాచలం ఐటీడీఏ పీవో, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి ప్రతీక్‌జైన్ అన్నారు. శనివారం భద్రాచలంలో గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న షాపింగ్ కాంప్లెక్సు, వైకుంఠధామం, యుబీ రోడ్డులోని ఖాళీ స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పుణ్యక్షేత్రమైన భద్రాచలాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు సిబ్బంది సమర్థవంతంగా పని చేయాలన్నారు. తడి, పొడి చెత్త సేకరణ విషయంలో సిబ్బంది అలసత్వం వహించకుండా చూడాలన్నారు. శ్రీరామనవమి దగ్గర పడుతున్నందున పంచాయతీకి సంబంధించిన పనులు ఏమైనా ఉంటే త్వరగా పూర్తి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బూర్గంపాడు: తడి, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరించి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డ్‌లోనే డంప్ చేయాలని ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్ అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. శనివారం మండల పరిధిలోని సారపాక డంపింగ్ యార్డు, పల్లె ప్రకృతి వనం, నర్సరీ, వైకుంఠధామాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రాచలం సీతారామచంద్రస్వామి దర్శనానికి వివధ ప్రాంతాల నుంచి భక్తులు సారపాక మీదుగానే అధిక సంఖ్యలో వస్తూ ఉంటారని, అందుకోసం చెత్త ఎక్కడపడితే అక్కడ వేయకుండా భక్తులకు ఇబ్బంది కలగకుండా డంపింగ్ యార్డ్‌లోనే వేయాలన్నారు. ఆయన వెంట పంచాయతీ ఈవో మహేష్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



సారపాకలో పల్లెప్రకృతి వనాన్ని పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్

జర్నలిస్టుల పట్ల కేంద్రం మొండి వైఖరి విడనాడాలి

● టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు ఉదయ్‌కుమార్

కొత్తగూడెం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మీడియా రంగాన్ని కేంద్ర ప్రభుత్వం నానాటికి నిర్వీర్యం చేస్తుందని, జర్నలిస్టుల పట్ల కేంద్రం అనుసరిస్తున్న మొండి వైఖరిని విడనాడాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఐజేయూ అనుబంధం) భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు ఇమంది ఉదయ్ కుమార్ అన్నారు. శనివారం జర్నలిస్ట్ షాహిద్ భగత్‌సింగ్, రాజుగురు, సుఖ్‌దేవ్‌లు వర్ధంతిని పురస్కరించుకుని దేశ వ్యాప్త ఆందోళన, నిరసన కార్యక్రమాలను చేపట్టారు. అనంతరం ఆర్డీవో మధుకు పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమం విషయంలో కేంద్రం ద్వంద్వవైఖరిని అవలంభిస్తుందని ఆరోపించారు. తృణప్రాయంగా భావించి బ్రిటీష్ అధికారులను ఎదిరించి పార్లమెంట్‌లోనే బాంబులు వేసి ప్రాణాలను బలిపెట్టి అసువులు బాసి అమరత్వం పొందిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లు స్వేచ్ఛ కోసం చేసిన త్యాగం నేటికి ఎన్నటికి మరువరానిదని కొనియాడారు.

ఈ కార్యక్రమంలో నేషనల్ కౌన్సిల్ మెంబరు దుద్దుకూరు రామారావు, జాయింట్ సెక్రటరీ ఎర్ర ఈశ్వర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఏర్పుల సుధాకర్‌రావు, జిల్లా నాయకులు జునుమాల రమేష్, రాజేష్, బాపట్ల మురళీ తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న టీయూడబ్ల్యూజే(ఐజేయూ)నాయకులు

ముగిసిన పోషన్ పఖ్వాడా

సత్తుపల్లిరూరల్, మార్చి23: ఈనెల 8వ నుంచి సత్తుపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోషన్ పఖ్వాడా కార్యక్రమం శనివారంతో ముగిసిందని సీడీపీవో ఏ.కొండమ్మ తెలిపారు. పౌషకాహారం, ఆరోగ్యం, బాల్య సంరక్షణపై దృష్టి సారించే కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా పట్టణంలోని మసీద్ రోడ్‌లోని ఏర్పాటు చేసిన చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమాలలో ఆమె పాల్గొన్నారు.



అన్నప్రాసన నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

మానవతప్పిదాలే ప్రమాదాలకు కారణం

● ఆర్టీసీ విశ్రాంత డిపో మేనేజర్ వెంకటేశ్వరబాబు

అశ్వారావుపేట రూరల్, మార్చి 23: మానవ తప్పిదాల వల్లనే 80 శాతం ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రాణాలు పోసే శక్తి మనకులేనపుడు ప్రాణం తీసే హక్కు మనకు లేదని ఆర్టీసీ విశ్రాంత డిపో మేనేజర్ వెంకటేశ్వరబాబు అన్నారు. స్థానిక వ్యవసాయ కళాశాలలో శనివారం విద్యార్థులకు రోడ్డు ప్రమాదాలు, కారణాలు, నివారణ మార్గాలు అనే అంశాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రయాణ సమయంలో పాటించాల్సిన నిబంధనలపై పలు సూచనలు చేశారు. విద్యార్థులంతా ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించి, ప్రమాదాలు లేని సమాజాన్ని సాధించటానికి సహకరించాలని కోరారు. తప్పకుండా హెల్మెట్ ధరించి ప్రయాణాలు చేయాలని, చిన్న చిన్న పొరపాట్లే పెద్ద ప్రమాదాలకు కారణమవుతాయన్నారు. కొందరు మితిమీరిన వేగంతో వెళ్లి ఇతరుల ప్రాణాలు పోవటానికి కారణమవుతున్నారని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ఇన్నోవేషన్ క్లబ్ ఇన్‌చార్జి డాక్టర్ శ్రావణ్ కుమార్, ఇన్‌చార్జి అసోసియేట్ డీన్ డాక్టర్ గోపాలకృష్ణమూర్తి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న విశ్రాంత డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు

చిమ్మపూడి ఆలయంలో చోరీ

రఘునాథపాలెం, మార్చి 23: చిత్తు కాగితాలు సేకరించేందుకు గ్రామంలోకి వచ్చిన కొందరు ఏకంగా దేవాలయంలో చోరీ చేసిన సంఘటన రఘునాథపాలెంలో చోటు చేసుకొంది. ఆలయ కమిటీ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. చిమ్మపూడి గ్రామంలోకి శనివారం కొంతమంది చిత్తు కాగితాలు సేకరించేందుకు గ్రామంలోని వీధుల వెంట తిరిగారు. మధ్యాహ్నం ఎవ్వరు లేని సమయంలో గ్రామంలోని శ్రీలక్ష్మీ నర్సింహస్వామి ఆలయంలో కొంత సేపు కూర్చొని వెళ్లారు. సాయంత్రం అలయ పూజారి వెళ్లి పూజలు చేసేందుకు సిద్ధంగా కాగా, ఆలయంలో దేవుడి పెద్ద గంటలు 2, చిన్న గంటలు 1, అర్చన కలిశాలు, శఠగోపురం, కుందులు మొత్తం రూ.60 వేలు విలువైన అభరణాలు చోరీ జరిగినట్లు గుర్తించారు. దీంతో ఆలయ కమిటీ సభ్యులకు పూజారి విషయాన్ని తెలియజేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు నాగళ్ల పుల్లయ్య, గాదె వెంకటరెడ్డి, జో నబోయిన పాపులు, మారం కరుణాకర్ రెడ్డి, తూము సత్యనారాయణతో పాటు అర్చకులు మురళీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామంలోకి చిత్తుకాగితాలు సేకరించేందుకు వచ్చిన వ్యక్తులు చోరీ చేసి ఉంటారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

భద్రాచలానికి పాదయాత్రగా వెళ్లిన దమ్మపేట భక్తులు

దమ్మపేట, మార్చి23: దమ్మపేటకు చెందిన సీతారామ భక్త బృందం సభ్యులు గోటి తలంబ్రాలు తయారు చేసి సీతారామచంద్రస్వామికి సమర్పించేందుకు శనివారం పాదయాత్రగా భద్రాచలం తరలి వెళ్లారు. ముక్కోటి శివరాత్రి నుంచి మహిళా భక్తులు భక్తి శ్రద్ధలతో గోటి తలంబ్రాలు చేయటం ప్రారంభించారు. ఎనిమిదేళ్లుగా సీతారామభక్త బృందం సభ్యులు గోటి తలంబ్రాలను భద్రాచలం రామాలయంలో అందజేస్తున్నామని, వీటిని శ్రీరామనవమి సందర్భంగా నిర్వహించే స్వామి వారి కల్యాణ తలంబ్రాలలో వీటిని ఉపయోగించడం జరుగుతుందని కమిటీ అధ్యక్షురాలు మురహరి సత్యావతి తెలిపారు. భక్తబృందంలో మురహరి గంగ, సరస్వతి, అర్చన, అత్తులూరి కుమారి, కందుకూరి విజయ, సీతారత్నం, తదితరులున్నారు.



భద్రాచలానికి వెళ్తున్న భక్తులు

జమలాపురం ఆలయంలో శని త్రయోదశి పూజలు

ఎర్రుపాలెం, మార్చి 23: జమలాపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో శని త్రయోదశి సందర్భంగా శనివారం శ్రీవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాస్‌శర్మ ఆధ్వర్యంలో సుగంధ ద్రవ్యాలతో, పంచామృతాలతో శ్రీవారికి సర్వాంగాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు నవగ్రహ మండపంలో శనిగ్రహానికి తైలాభిషేకం, నవగ్రహ ఆరాధనలు జరిపారు. భక్తుల ఆధ్వర్యంలో స్వామి నిత్యకల్యాణాన్ని నిర్వహించారు. ఆలయ ఆవరణలో భక్తులు తమ నూతన వాహనాలకు పూజాదికార్యక్రమాలు చేపట్టారు. అనంతరం భక్తులకు ఆలయ అధికారులు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి కొత్తూరు జగన్‌మోహన్‌రావు, సూపరింటెండెంట్ విజయకుమారి, భక్తులు పాల్గొన్నారు.



మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

ఆకుకూరల సాగు.. బహుబాగు



- మండే ఎండల్లో మెండుగా లాభాలు
- తగిన జాగ్రత్తలతో అధిక దిగుబడి
- వేసవి ఉష్ణోగ్రతలను తట్టుకునేలా జాగ్రత్తలు

ఖమ్మం వ్యవసాయం, మార్చి23: ఆకుపచ్చని ఆహారం తీసుకుంటే ఆరోగ్యం పది కాలాల పాటు చక్కగా ఉంటుంది. అదేవిధంగా వేసవిలో ఆకు కూరల సాగు రైతులకు లాభసాటిగా ఉంటుంది. జిల్లాలో ఖమ్మం అర్బన్, రూరల్, రఘునాథపాలెం, కూసుమంచి మండలాల్లో అధికంగా ఆకుకూరలు పండిస్తున్నారు. ఆకుకూరలు అధిక ఉష్ణోగ్రతలను కాబట్టి వేసవిలో సాగుకు నీడ ఉన్న ప్రాంతాన్ని ఎంచుకోవాలి. పొలంలో నీడనిచ్చేలా మొక్కజొన్న, ఆముదం పంటలను ఉత్తర, దక్షిణ దిశల్లో నాటితే ఆకుకూరల పాదులకు మంచిది. వేసవిలో మొక్క పెరుగుదల తక్కువగా ఉంటుంది. కాబట్టి మొక్కల సంఖ్య ఎక్కువగా ఉండే విధంగా చూసుకోవాలి. వేసవిలో నీటి అవసరం ఎక్కువ కాబట్టి స్ప్రింక్లర్ల పద్ధతిలో ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసుకోవచ్చు.

అనుకూల ఆకుకూరలు..

వేసవిలో ముఖ్యంగా గోంగూర, తోటకూర, పాలకూర, మెంతికూర, కొత్తిమీర, పుదీనా ఆకు కూరలు సాగు రైతులకు మేలు చేస్తాయి. వేసవిలో సాగుకు అనుకూలమైన విత్తనాలనే వాడాలి.

తోట కూర... తోట కూరలో ఆర్ఎన్ఏ-1 రకం ముఖ్యమైనది. ఆకులు, కాండం లేత ఆకుపచ్చ రంగులో ఉంటాయి. విటమిన్ ఏ, సీలు అధికంగా ఉంటాయి. కాండం కూడా పీచు లేకుండా మృదువుగా రుచి కరంగా ఉంటుంది. నెల రోజుల్లో ఎకరాకు 5-6 టన్నుల దిగుబడి వస్తోంది. మొదటి కోత ఎత్తిన 15-20 రోజుల్లో వస్తోంది. మొదటి కోత తర్వాత పక్క కొమ్మలు బాగా వస్తాయి. నీటి ఎద్దడిని తెల్ల మచ్చ తెగులు తట్టుకుంటుంది. ఎకరానికి 800 గ్రాముల విత్తనం అవసరం.

పాలకూర.. పాలకూరలో ఆల్‌గ్రీన్ రకం లేత ఆకులు కలిగి 15 నుంచి 20 రోజులకు కోతకు వస్తోంది. 6 నుంచి 7 కోతల్లో ఎకరానికి 5 నుంచి 6 టన్నుల దిగుబడి వస్తోంది. ఎకరానికి 10 నుంచి 12 కిలోల విత్తనాలు అవసరం. విత్తనాలను 20/10సెంటీమీటర్ల ఎడంగా, 3-4 సెంటీ మీటర్ల లోతు మించకుండా విత్తుకోవాలి. లోతు ఎక్కువైతే మొక్క సరిగ్గా రాదు. విత్తిన 8-10 రోజులకు గింజలు మొలకెత్తుతాయి.

గోంగూర.. ఏఎస్‌జీఆర్‌యూ-1 రకం ప్రధానమైనది. ఎకరానికి 4-5 టన్నుల దిగుబడి వస్తోంది. ఎకరాకు 6 కిలోల విత్తనం అవసరం. ముందుగా 60 సెంటీమీటర్ల ఎడంగా బోదలు చేసుకుని, బోదలకు రెండు వైపుల విత్తనాన్ని 30 సెంటీమీటర్ల దూరంలో వరుసల్లో వేయాలి. మొలకెత్తిన 20 రోజులకు ఒత్తుగా ఉన్న మొక్కలను పీకి కట్టలు కట్టి విక్రయించాలి.

మెంతి కూర.. పూసా ఎర్లీ బంచీంగ్ రకం. ఇది త్వరగా కోతకు వచ్చే రకం. ఎకరాకు 8 నుంచి 10 కిలోల విత్తనాన్ని వరుసల మధ్య 25 సెంటీమీటర్లు, మొక్కల మధ్య 10 సెంటీమీటర్ల ఎడం ఉండే విధంగా విత్తుకోవాలి.

కొత్తిమీర.. సీఎస్-6 రకం పంట కాలం 80 నుంచి 85 రోజులు నీటి ఎద్దడిని తట్టుకుంటుంది. సాధన (సీఎస్-4) రకం పేను బంకను తట్టుకుంటుంది. ఎకరానికి 4 నుంచి5 కిలోల విత్తనాన్ని 15సెం.మీ. ఎడంలో విత్తుకోవాలి. విత్తిన 8-12 రోజుల్లో గింజలు మొలకెత్తుతాయి.

షేడ్ నెట్లతో బహుళ ఉపయోగాలు

బీవీ రమణ, ఉద్యాన అధికారి ఖమ్మం



ఆకుకూరల సాగులో రైతులు తగిన యాజమాన్య పద్ధతులు పాటించాలి. ఉద్యాన అధికారుల సూచించిన రకాలను పండిస్తే అధిక దిగుబడి వస్తుంది. బోర్లు, బావులు, నీటి వనరులు ఉన్న చోట చిన్న కమతాలుగా ఆకుకూరలు పండించి రైతులు లాభం పొందవచ్చు. ఎండలు అధికంగా ఉంటున్నందున షేడ్ నెట్లను ఉపయోగించాలి. దీని వల్ల వేడి నుంచి రక్షణతో పాటు చీడపీడలు కూడా దరిచేరవు.



ఆర్గానిక్ సేద్యం.. లాభాలు తథ్యం

- ఆరోగ్యానికి భరోసా సేంద్రియ కాయగూరలు
- ఆదర్శంగా నిలుస్తున్నరైతు

అశ్వాపురం, మార్చి 23: రసాయనాలు ఉపయోగించకుండా పండించే కాయకూరలకు డిమాండ్ బాగానేఉంది. మండలంలోని బీజీ కొత్తూరు గ్రామానికి చెందిన యువ రైతు మర్రి శ్రీనివాసరెడ్డి తాజా కాయకూరలను సేంద్రియ విధానంలో పండిస్తున్నారు. తనకున్న ఎకరంన్నర పొలంలో బోరు సాయంతో రబీ సాగులో భాగంగా రూ.లక్ష పెట్టుబడితో సాగు చేపట్టాడు. బెండ, సోర, దోసకాయ, బీరకాయతో పాటు ఆకు కూరలు కూడా పండిస్తున్నారు.

సేంద్రియ పద్ధతిలో...

కాయకూరల సాగులో ఎలాంటి రసాయన పదార్థాలు ఉపయోగించడం లేదు. కేవలం సాగులో ఆవుఎరువు, మూత్రం, కొమ్ములనుండి తీసిన బీడీ 500వంటి సేంద్రియ పదార్థాలు, ఆకర్ష ఎరలు, సహజ పదార్థాలనే వాడుతూ సాగు చేపట్టారు. సుడోమోనాస్,సేంద్రియకార్బనం, సీవీడ్ ఎక్స్‌ట్రాక్ట్, పురుగుల నివాణకు మట్టిద్రావణం పిచికారి సాగు చేపట్టినట్లు రైతు వివరించారు.

ఆర్గానిక్ పంటలు అందించాలన్నదే లక్ష్యం

శ్రీనివాసరెడ్డి, రైతు



సేంద్రియ విధానంలో సాగుతో దిగుబడి తగ్గినా, మంచి పంటలను ప్రజలకు అందించాలన్న లక్ష్యంతో ఉన్నా. ప్రస్తుత వాతావరణానికి తగ్గట్టుగా కూరగాయలు సాగు చేపట్టాను. పెట్టుబడికి రెట్టింపు ఆదాయం వచ్చే అవకాశం ఉంది.



పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వీపీ గౌతమ్

'పది' పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్

ఖమ్మంచర్చికాంపౌండ్, మార్చి 23: నగరంలో జరుగుతున్న పదో తరగతి పరీక్షల కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ శనివారం సందర్శించారు. ఈసందర్భంగా ఖమ్మం నగరంలోని నిర్మల్‌హృదయ్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్షాకేంద్రాన్ని సందర్శించి పరీక్ష సరళిని పరిశీలించారు. కేంద్రంలో కనీస వసతులైన వైద్యశిబిరం, తాగునీటిలను పరిశీలించారు. వేసవి దృష్ట్యా వైద్యశిబిరం వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలన్నారు. ఎక్కడా ఎటువంటి సంఘటనలను జరగకుండా పరీక్షల నిర్వహణ చేపట్టాలన్నారు. మొబైల్‌ఫోన్లను కేంద్రంలోకి అనుమతించవద్దన్నారు. ఈకార్యక్రమంలో పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెడెంట్ బి.శ్రీదేవి, ఖమ్మంఅర్బన్ తహసీల్దార్ సీహెచ్ స్వామి, తదితరులు పాల్గొన్నారు.

రేపు సామూహిక శ్రీలక్ష్మి పూజలు

భద్రాచలం, మార్చి 23: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో సోమవారం సామూహిక శ్రీలక్ష్మీ పూజలను నిర్వహించనున్నారు. శోభకృత్ నామ సంవత్సర ఫాల్గుణశుద్ధ పూర్ణిమ(ఫాల్గుణోత్తర)ను పురస్కరించుకొని శ్రీలక్ష్మీ మహిళ సేవా సమితి, భద్రాద్రి దేవస్థానంల సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. గత 20 ఏళ్లుగా సంస్కృత పండితులు ఎస్వీజీ శ్రీమన్నారాయణాచార్యులు పర్యవేక్షణలో ఫాల్గుణోత్తర పర్వదినంను పురస్కరించుకొని సామూహిక శ్రీలక్ష్మీ పూజలు రామాలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్నారు. రూ.600 దేవస్థానానికి చెల్లించాల్సి ఉండగా పూజలో పాల్గొనే మహిళలకు లక్ష్మీ వెండి ప్రతిమ, జాకెట్, లడ్డూ, పులిహోర ప్రసాదం, శ్రీ లక్ష్మీ అమ్మవారి కుంకుమ అందజేస్తారు.

అమ్మో.. స్పీడ్ బ్రేకర్లు..



ఎత్తుగా ఉన్న స్పీడ్ బ్రేకర్, గడ్డితో నిండిన రోడ్డు

బోనకల్, మార్చి 23: బోనకల్ నుంచి ఆళ్లపాడు వైపునకు వెళ్లే మార్గంలో రైల్వే గేటు కింద ఏడాది క్రితం నిర్మించిన అండర్ బ్రిడ్జి రోడ్డు సమస్యలకు నిలయంగా మారింది. రోడ్డుపై ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లు పరిమితికి మించి ఎత్తుగా ఉన్నాయి. దీని వలన చిన్న వాహనాలు, కార్లు కింది భాగం స్పీడ్ బ్రేకర్లకు తగిలి దెబ్బతింటున్నాయి. అండర్ బ్రిడ్జి మార్గంలో రోడ్డుకు రెండు వైపుల గడ్డి మొక్కలు పెరిగాయి. నిలిచిన నీరు, పెరిగిన గడ్డి వలన అండర్ బ్రిడ్జి ప్రాంతంలో దుర్వాసన వస్తోంది.

ఆరేళ్లయినా అతీగతీ లేదు..

- పూర్తికాని మద్దులపల్లి మార్కెట్ నిర్మాణం
- వచ్చే ఖరీఫ్ సీజన్‌కైనా అందుబాటులోకి వచ్చేనా?
- అనుసంధాన రోడ్డు పనుల పెండింగ్
- ఇద్దరు మంత్రులపై ఆశలు పెట్టుకున్న అన్నదాతలు

ఖమ్మం రూరల్, మార్చి 23: పాలేరు నియోజకవర్గంలో రైతులకు మేలు చేయాలని అప్పటి, ఇప్పటి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆరేళ్ల క్రితం మద్దులపల్లిలో మోడల్ మార్కెట్‌ను మంజూరు చేయించారు. 24 ఎకరాల భూమి కేటాయించడం, రూ.20కోట్ల నిధులు మంజూరు చేయడం వేగంగా జరిగాయి. అయితే నత్తనడకన సాగుతున్న నిర్మాణ పనులు ఎంతకీ పూర్తికాకపోవడంతో మార్కెట్ అందుబాటులోకి రాలేదు. వచ్చే ఖరీఫ్ సీజన్‌కైనా నిర్మాణం పూర్తవుతుందా అని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

ఆరేండ్ల క్రితం మంజూరు..

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2018లో అప్పటి, ఇప్పటి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవతో మద్దులపల్లి మోడల్ మార్కెట్ మంజూరైంది. కేంద్ర ప్రభుత్వ నూతన వ్యవసాయ చట్టాలతో ఉన్న మార్కెట్లనే మూసేసే పరిస్థితి నెలకొనగా.. మద్దులపల్లి మార్కెట్ నిర్మాణంపై నీలినీడలు అలుముకున్నాయి. కేంద్రం ఆ వ్యవసాయ చట్టాలను రద్దుచేయడంతో మళ్లీ మార్కెట్ నిర్మాణంపై ఆశలు రేకెత్తాయి. 2022 మే 4న నాటి వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, పాలేరు ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.



నిలిచిపోయిన మద్దులపల్లి మార్కెట్ నిర్మాణం

రెండు పర్యాయాలు టెండర్..

మార్కెట్ నిర్మాణం కోసం రెండు సార్లు టెండర్లు జరిగాయి. మొదట సారి టెండర్ దక్కించుకున్న వ్యక్తి పనులు ప్రారంభించకుండానే రద్దు చేసుకున్నాడు. రెండో సారి టెండర్ దక్కించుకున్న సంస్థతో నాటి ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి పనులు ప్రారంభం చేయించారు. సూర్యాపేట రహదారి నుంచి మార్కెట్ మీదుగా వరంగల్ రహదారికి అనుసంధాన రహదారి నిర్మాణం కోసం ఎన్నెస్పీ స్థలాన్ని ఎంపిక చేశారు. అనంతరం ఆ పనులు కూడా అక్కడే ఆగిపోయాయి. మార్కెట్ నిర్మాణపనులు కొంత మేరకు జరిగి మళ్లీ ఆగిపోయాయి.

త్రిసభ్య కమిటీ విచారణ..

పాలేరు ఎమ్మెల్యేగా గెలిచిన రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిపై రైతులు ఆశలు పెట్టుకున్నారు. మంత్రి పొంగులేటి గెలిచిన కొద్ది రోజులకే మద్దులపల్లి మోడల్ మార్కెట్‌పై ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు. ఇటీవల మార్కెట్ నిర్మాణాలను పరిశీలించారు. పనులకు సంబంధించి అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. నాసిరకంగా నిర్మాణాలు జరుగుతున్నాయని తాత్కాలికంగా పనులు నిలిపివేయాలని అధికారులను ఆదేశించారు. క్వాలిటీ కంట్రోల్, మట్టితోలకాలు, నిర్మాణాలు తదితర వాటికి సంబంధించిన అంశాలపై ఆర్డీవో, మైనింగ్ ఏడీ, డీఎంవోతో త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేశారు. మార్కెట్‌కు సంబంధించిన నివేదికను అందజేయాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం మార్కెట్ నిర్మాణాలపై విచారణ కొనసాగుతుంది.

మంత్రులపైనే అన్నదాతల ఆశలు...

పాలేరు ఎమ్మెల్యే, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి రెవెన్యూ, సమాచార శాఖ మంత్రిగా ఉన్నారు. మద్దులపల్లికి మోడల్ మార్కెట్‌ను మంజూరు చేయించిన తుమ్మల ప్రస్తుతం వ్యవసాయశాఖ మంత్రిగా ఉన్నారు. ఇద్దరు మంత్రులు కలిసి మార్కెట్‌ను వీలైనంత తొందరలోనే మార్కెట్ నిర్మాణాలు పూర్తి చేయించి అందుబాటులోకి తీసుకువస్తారని అన్నదాతలు ఆశగా ఎదురు చూస్తున్నారు.



విద్యార్థినులతో డీసీహెచ్ఎస్ వెంకటేశ్వర్లు

వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో సేవలు

సత్తుపల్లిరూరల్, మార్చి 23: ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ (100పడకలు)లో శిక్షణ, నర్సుల సేవలు సాగించుటకు అన్నివిధాలుగా నర్సింగ్ కళాశాల సిద్ధంగా ఉందని డీసీహెచ్ ఎస్ బి. వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం మండలంలోని కిష్టారం నర్సింగ్ కళాశాలలో లాంప్ లైటింగ్, కాపింగ్ కార్యక్రమం నిర్వహించారు. 60మంది విద్యార్థినులు శిక్షణ పొందుతున్నారని, తగిన వసతులు కల్పించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ఫ్లోరెన్స్ నైటింగేల్ ప్రతిజ్ఞ చేశారు. బీఎస్సీ నర్సింగ్ 4వ సంవత్సరం కోర్స్ విజయవంతంగా కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కేబీ జ్యోత్స్న, వైద్యులు శివకుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ కె. విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

క్షయ తగ్గుముఖం..

- రోజువారీ మందులతో నివారణ సులభం
- భద్రాద్రి జిల్లాలో ఈ ఏడాది 361 టీబీ కేసులు

భద్రాచలం, మార్చి 23: ' అవును క్షయ(టీబీ) వ్యాధిని అంతం చేద్దాం..' ఇదే ఈ సంవత్సరం ప్రపంచ ఆరోగ్య సంస్థ నినాదం. గతంతో పోలిస్తే ప్రపంచ ఆరోగ్య సంస్థ చేపట్టిన చర్యలతో రెండు దశాబ్దాలుగా క్షయ తగ్గుముఖం పడుతోందని వైద్య వర్గాలు పేర్కొంటున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గతంతో పోలిస్తే క్షయ వ్యాధి తగ్గుముఖం పడుతోంది. అయినప్పటికీ ఇంకా క్షయను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు చేయాల్సింది ఎంతో ఉంది. ఈ క్రమంలో జిల్లాకు జాతీయస్థాయిలో క్షయ నివారణ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొంటున్నందుకు 2021, 2022లో కేంద్ర ప్రభుత్వ కాంస్య పతకాలు లభించాయి. కాగా 2023లో రజత పతకం సాధించగా 2024కు జాతీయస్థాయిలో స్వర్ణపతకం కోసం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాను ప్రతిపాదించారు. వాస్తవానికి క్షేత్రస్థాయిలో ఇందుకు సంబంధించి అధికారుల బృందం సర్వే నిర్వహించాల్సి ఉన్నప్పటికీ ఎన్నికల కోడ్‌తో వాయిదా పడింది.

నేడు ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినం

142 ఏళ్లుగా క్షయవ్యాధి దినం..

ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవం 1882 సంవత్సరం మార్చి 24న రాబర్ట్ కాక్స్ అనే శాస్త్రవేత్త క్షయ వ్యాధి కారక క్రిమి బాక్టీరియా మైకో బాక్టీరియాను కనుగొన్నారు. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం మార్చి 24న క్షయ వ్యాధి నివారణ కోసం అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

తెమడ పరీక్షతో క్షయ నిర్ధారణ

ఎక్సరే ద్వారా, సీబీన్యాట్ పరీక్ష ద్వార నిర్ధారణ చేస్తారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అన్ని పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, యుపీహెచ్‌సీ, ఏరియా వైద్యశాలల్లో ఏరియా వైద్యశాలల్లో, జిల్లా ఆసుపత్రుల్లో తెమడ పరీక్ష నిర్ధారణ కేంద్రాలు ఉన్నాయి. ముఖ్యంగా భద్రాచలం, కొత్తగూడెం ప్రభుత్వ ఏరియా వైద్యశాలల్లో కాట్రిడ్జ్‌బేస్డ్ యాక్లిక్ యాసిడ్, యాంప్లిఫికేషన్ టెస్ట్ (సీబీ న్యాట్) పరీక్షలు నిర్వహిస్తారు.

జిల్లాలో క్షయలేని జీపీలు..

కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో టీబీముక్త్ పంచాయతీలో భాగంగా జిల్లాలో ఎనిమిది పంచాయతీలను ప్రతిపాదించారు. ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సర్వే చేసిన అనంతరం వాటిని క్షయలేని గ్రామ పంచాయతీలుగా గుర్తించే అవకాశం ఉండనుంది. అయితే తొలిసారిగా అవార్డు తీసుకొనే పంచాయతీకి ప్రోత్సాహకాలను ప్రభుత్వం అందజేయనుంది. వరుసగా మూడుసార్లు ప్రోత్సాహకం సాధించిన పంచాయతీలకు బంగారు రంగుతో ఉన్న గాంధీబొమ్మను అందజేస్తారు. గతంలో క్షయ వ్యాధి ద్వారా మరణాలు జిల్లాలో 3.8 శాతం ఉండగా గత రేండెళ్లుగా ఇది రెండు శాతంకు తగ్గింది. రాబోయే రోజుల్లో క్షయ వ్యాధి కారణంగా మరణాలను పూర్తిస్థాయిలో నిర్మూలించాల్సిన అవసరం ఉంది.



క్షయ రోగికి పండ్లు అందజేస్తున్న దృశ్యం

ఐదేళ్లుగా జిల్లాలో క్షయ కేసుల వివరాలు ఇలా

సంవత్సరం	కేసులు	సక్సెస్ రేటు
2019	2376	90
2020	2065	91
2021	2207	90
2022	2137	92
2023	1567	91
2024	361	90 ..ఇప్పటివరకు



మరింత స్ఫూర్తితో ముందుకు వెళ్తాం

డాక్టర్ జి. శ్రీనివాస్, జిల్లా క్షయ నివారణ అధికారి

క్షయ వ్యాధి అంతం కోసం కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీంతో క్షయ కేసులు తగ్గింపు కోసం వైద్య ఆరోగ్య శాఖ పకడ్బందీ ప్రణాళిక చేపట్టి క్షేత్రస్థాయిలో పని చేస్తోంది. ఇందులో భాగంగా జిల్లాకు రెండు కాంస్య పతకాలు, ఒక రజత పతకం రావడం జరిగింది. ఈసారి స్వర్ణ పతకం కోసం ప్రతిపాదించాం. జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శిరీష పర్యవేక్షణలో వైద్యాధికారులు పకడ్బందీగా క్షయను పూర్తిస్థాయిలో అదుపు చేసేందుకు చర్యలు చేపడుతున్నారు.

నిర్ణయాధికారం మహిళలదే..

- మానుకోట పార్లమెంట్ స్థానంలో అతివలే అధికం
- 7,81,339మంది ఓటర్లుగా లెక్క.

ఇల్లెందురూరల్, మార్చి23: మహబూబాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గంలో మొత్తం ఓటర్ల సంఖ్య 15,26,998గా ఉందని ఎన్నికల అధికారులు ప్రకటించారు. మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో 7 అసెంబ్లీ సెగ్మెంట్లు ఉన్నాయి. మహబూబాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో అధికంగా, భద్రాచలం అసెంబ్లీ సెగ్మెంట్‌లో తక్కువగా ఓటర్లు ఉన్నారు. అన్ని సెగ్మెంట్లలోనూ మహిళా ఓటర్లు అధికంగా ఉండటం గమనార్హం. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో పురుష ఓటర్లు 7,45,554మంది ఉండగా, మహిళా ఓటర్లు 7,81,339 మంది ఉన్నారు. కాగా 8 5 ఏళ్ల వయసు పైబడి ఇంటివద్దనే ఓటుహక్కును వినియోగించుకునేందుకు 10,724 మంది ఓటర్లు అర్హులుగా ఉన్నట్లు ఎన్నికల అధికారులు గుర్తించారు. కాగా తొలిసారి ఓటు హక్కు వినియోగించుకునేందుకు 18నుంచి 19 సంవత్సరాల వయసు కలిగిన యువ ఓటర్లు 44,888 మంది నమోదయ్యారు. 57 మంది ఎన్ఆర్ఐ ఓటర్లు,33,506 మంది పీడబ్ల్యూడీ ఓటర్లు,1421 మంది సర్వీస్ ఓటర్లుగా నమోదయ్యారు.

అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా లోక్‌సభ ఎన్నికల ఓటర్ల సంఖ్య..

సెగ్మెంట్	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
డోర్నకల్	1,08,931	113165	7	2,22,103
మహబుబాబాద్	1,26,290	1,31,449	47	2,57,786
నర్సంపేట	1,14,891	1,20,104	9	2,35,004
ములుగు	1,13,413	1,18,935	26	2,32,374
పినపాక	99,608	1,03,525	5	2,03,138
ఇల్లెందు	1,09,632	1,14,818	4	2,24,454
భద్రాచలం	72,789	79,343	7	1,52,139
మొత్తం	7,45,554	7,81,339	105	15,26,998

కాంగ్రెస్, బీఆర్ఎస్ దొందూదొందే

- బీజేపీ ఎంపీ అభ్యర్థి సీతారాంనాయక్

ఇల్లెందు, మార్చి 23: అవినీతి, కుంభకోణాలు, నిర్బంధాలు, ప్రశ్నించేవారిని అణచివేయడంలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు తేడాలేదని, రాష్ట్రంలో 12ఎంపీస్థానాల్లో బీజేపీ గెలుపు తథ్యమని మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి ప్రొఫెసర్ అజ్మీర సీతారాంనాయక్ స్పష్టం చేశారు. శనివారం ఇల్లెందు పట్టణంలో నియోజకవర్గ, పట్టణ కార్యకర్తలు, ముఖ్యనాయకుల సమావేశాల్లో ఆయన మాట్లాడార. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం రావడం తథ్యమని, కాంగ్రెస్‌కు ఓట్లువేస్తే వృథాగామారుతాయన్నారు. ఈ కార్యక్రమంలో లోక్‌సభనియోజకవర్గ ఎన్నికల కన్వీనర్ నూకల వెంకటరెడ్డి, బీజేపీ నాయకులు శ్రీనివాసరెడ్డి, కె.సంజీవరెడ్డి, రేవెళ్ల నాగరాజు, మహిళామోర్చ నాయకురాలు సుచిత్ర, సునీత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వర్తక వ్యాపార ప్రముఖులు సైఫా శ్రీనువాస్, పుల్లూరు సతీష్, అనిల్ తివారీ, ప్రహ్లాద్ తివారీ, అరుణ్ తివారీలు బీజేపీ పార్టీలో చేరారు.



ప్రసంగిస్తున్న సీతారాం నాయక్

అభివృద్ధి పథకాలు నా హయాంలోనే..

మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో ప్రాంతీయపార్టీ ఎంపీగా తాను సాధించిన అభివృద్ధి పథకాలు కేంద్ర మంత్రిగా బలరాంనాయక్, ఎంపీగా మాలోతు కవిత సాధించలేకపోయారని అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు.

భద్రాద్రి అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

- ఐదు పంచాయతీలు భద్రాద్రిలో విలీనం చేసి చూపిస్తా
- కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్

భద్రాచలం, మార్చి 23: భద్రాచలం అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని కేంద్ర మాజీ మంత్రి మహబూబాద్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ అన్నారు. భద్రాచలంలో శనివారం ఆయన భద్రాద్రి రామయ్యను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ భద్రాచలం నియోజకవర్గ ప్రజలు, నాయకులు పార్టీ కార్యకర్తలపై ఎంతో అభిమానం ఉందని వారి ఆకాంక్షల మేరకు సమస్యలను పరిష్కరించేందుకు అంకితభావంతో కృషి చేస్తానన్నారు. ఏపీ పరిధిలోకి వెళ్లిన ఐదు పంచాయతీలను భద్రాచలంలో తిరిగి విలీనమయ్యేలా చేసి చూపిస్తానని స్పష్టంచేశారు. గత రెండు దఫాలుగా బీఆర్ఎస్ నుంచి ఎంపికైన ఎంపీలు నియోజకవర్గానికి చేసిన అభివృద్ధి ఏంలేదని, తాను ఎంపీగా కేంద్ర మంత్రిగా ఉన్న సమయంలో చేసిన అభివృద్ధే ఇప్పటికీ ఉందని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో మహబూబాద్ పార్లమెంటు పరిధిలోని భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గ ప్రజలు తనకు ఓటు వేసి ఆశీర్వదించాలని ఆయన కోరారు.



మాట్లాడుతున్న బలరాంనాయక్

పీఏసీఎస్ వైస్ చైర్మన్‌గా నాగేశ్వరావు ఎన్నిక



ఇల్లెందురూరల్, మార్చి23: ఇల్లెందు పీఏపీఎస్ వైస్ చైర్మన్‌గా కొమరారం డైరెక్టర్ పోలేపల్లి నాగేశ్వరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం పీఏసీఎస్ కార్యాలయంలో జరిగిన వైస్ చైర్మన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన నాగేశ్వరావుకు పోటి లేక పోవడంతో ఎన్నికల అధికారి శ్రీనివాసరావు పోలేపల్లి నాగేశ్వరావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. గతంలో వైస్ చైర్మన్‌గా పనిచేసిన బండారి శ్రీనివాస్ పదవికి రాజీనామా చేయడంతో మారోమారు ఎన్నికను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ మేట్ల కృష్ణ, సీఈవో హరి, డైరెక్టర్లు పాల్గొన్నారు.



అమరుల ఆశయ సాధనకు పోరాడుదాం

పాల్వంచ, మార్చి 23: భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ లాంటి అమరవీరుల ఆశయాల సాధనకు పోరాడుదామని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ భద్రాచలం డివిజన్ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. శనివారం భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల 93వ వర్ధంతి సందర్భంగా పాల్వంచ నటరాజ్ సెంటర్ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు కాగడాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగత్‌సింగ్ నూనూగు మీసాల వయస్సులోనే పరాయి పాలనపై వీరోచితంగా పోరాడాడని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ సబ్ డివిజన్ కార్యదర్శి జక్కుల రాంబాబు, మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు వీరమల్ల ఉమ, డివిజన్ నాయకులు సత్యనారాయణ, మంకెన వెంకటేశ్వర్లు, మల్లయ్య, శ్రీను, నరేష్, సురేష్, వినోద, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

నేర సమీక్షలో ఎస్పీ రోహిత్ రాజు

కొత్తగూడెం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): రాబోయే పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండ పోలీస్ అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ ఎన్నికల సంఘం సూచనల ప్రకారం బాధ్యతగా విధులు నిర్వర్తించాలని ఎస్పీ రోహిత్ రాజు కోరారు. శనివారం ఎస్పీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లా పోలీస్ అధికారులతో నెలవారీ నేర సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో సమస్యాత్మక వ్యక్తులు, రౌడీషీటర్ల కదలికలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రజలంతా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా వారిలో భరోసా కల్పించే విధంగా పని చేయాలని తెలిపారు. గంజాయి అక్రమ రవాణా, క్రికెట్ బెట్టింగులు, జూదం, మట్కా వంటి అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అక్రమ మద్యం, నగదు రవాణాను నిరోధించడంలో భాగంగా చెక్‌పోస్టుల్లో విధులు నిర్వర్తించే సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని ఆదేశించారు. సరైన ఆధారాలు లేకుండా ఎవరైన పరిమితికి మించి నగదును రవాణా చేస్తూ పట్టుబడితే ఎన్నికల నియమావళి ప్రకారం కేసులు నమోదు చేయాలని, ప్రతి కేసులో క్వాలిటీ ఆఫ్ ఇన్వేస్టిగేషన్ ద్వారా నేరస్తులకు శిక్షపడే విధంగా చేసి బాధితులకు న్యాయం చేకూర్చాలని సూచించారు. కేసుల విచారణలో జాప్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై క్రమశిక్షణ చర్యలు తప్పవని, పెట్రోలింగ్, బ్లూకోల్ట్ వాహనాలతో అధికారులు, సిబ్బంది ఎల్లప్పుడు రోడ్లపై తిరుగుతూ ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ప్రభుత్వ నిషేధిత గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు బానిసలై యువత తమ అమూల్యమైన భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని, జిల్లా వ్యాప్తంగా హాట్‌స్పాట్‌ను గుర్తించి గంజాయిని రవాణా చేసే వ్యక్తులతోపాటు గంజాయిని సేవించే వారిపై కూడా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలోని ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ముఖ్యమైన ప్రదేశాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, దొంగతనం కేసుల్లో ప్రస్తుతం పోలీసుశాఖ వినియోగిస్తున్న సాంకేతికతను ఉపయోగించి నేరస్తులను పట్టుకుని సొత్తును రికవరి చేసి బాధితులకు త్వరితగతిన అందేలా చూడాలని తెలిపారు. సైబర్‌నేరాల బారిన పడకుండ ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా సైబర్‌నేరాల్లో నగదును కోల్పోయి బాధితులు వెంటనే స్పందించి ఫిర్యాదు చేసినప్పుడు సైబర్ నేరగాళ్ల ఖాతాల్లో ఉన్న నగదును పుట్ ఆన్ హోల్డ్‌లో ఉంచడం జరుగుతుందన్నారు. ఆ నగదును కోర్టు ద్వారా కొన్ని మార్గనిర్దేశాలతో బాధితులకు అందచేయడం జరుగుతుందని, ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి (బ్లాక్‌స్పాట్స్), వాటి నివారణకై సంబంధిత అధికారులతో సమన్వయం పాటిస్తూ ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు.పెండింగ్‌లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి న్యాయాధికారులతో సమన్వయం పాటిస్తూ బాధితులకు న్యాయం చేకూరేలా పని చేయాలని తెలిపారు. మద్యం సేవించి వాహనాలను నడుపుతూ ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ రోడ్డు ప్రమాదాలకు కారణమయ్యే వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ట్రైనీ ఐపీఎస్ విక్రాంత్ సింగ్, కొత్తగూడెం, పాల్వంచ, ఇల్లెందు, మణుగూరు డీఎస్పీలు అబ్దుల్ రెహమాన్, సతీష్‌కుమార్, చంద్రభాను, రవీందర్ రెడ్డి, డీసీఆర్బీ డీఎస్పీ మల్లయ్య స్వామి, జిల్లాలోని సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ, హాజరైన అధికారులు

పాల్వంచను సమగ్రాభివృద్ధి చేస్తా: కూనంనేని

పాల్వంచ రూరల్, మార్చి 23: పాల్వంచ మండలాన్ని సమగ్ర అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శనివారం మండల పరిధిలోని తోగ్గూడెం, జగన్నాథపురం గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూనంనేని మాట్లాడుతూ తనకు ఓట్లు వేసి గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే పాల్వంచ మండల సమగ్ర అభివృద్ధి కోసం ప్రణాళిక రచించి ఉన్నామని, త్వరితగతిన అభివృద్ధి పనులను పూర్తి చేయబోతున్నట్లు తెలిపారు. తోగ్గూడెం వద్ద మొర్రేడు వాగుపై చెక్‌డ్యాం నిర్మించి రైతులకు రెండోపంటకు నీరు అందించే బాధ్యత తనదేనన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం అనునిత్యం అందుబాటులో ఉంటానని ప్రజలకు హామీ ఇచ్చారు. గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు అందరి సహకారంతో అభివృద్ధి చేసుకున్నామని, ఇప్పుడు మరింత అభివృద్ధి సాధించేందుకు శక్తివంచన లేకుండ కృషి చేస్తానని స్పష్టం చేశారు. అనంతరం తోగ్గూడెం మాజీ సర్పంచ్ బాదావత్ శాంతి ఆధ్వర్యంలో 150 కుటుంబాలు సీపీఐలో చేరారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే కూనంనేని పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా, రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం, మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, జిల్లా సమితి సభ్యులు ఉప్పుశెట్టి రాహుల్, బండి నాగేశ్వరరావు, దుగ్గిరాల సుధాకర్, సీపీఐ, ప్రజాసంఘాల నాయకులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలి



సంతకాలు సేకరిస్తున్న నాయకులు

అశ్వారావుపేట రూరల్, మార్చి 23: అన్ని రకాల కార్మికులకు పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనాలను చెల్లించాలని, 2021లో ఇచ్చిన ఐదు రంగాలను గెజిట్ చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు పిట్టల అర్జున్ డిమాండ్ చేశారు. కార్మిక రంగంలో సవరణలు కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త సంతకాల సేకరణలో భాగంగా శనివారం అశ్వారావుపేటలో వివిధ రకాల కార్మికుల నుంచి సంతకాలను సేకరించారు. ఈ సందర్భంగా అర్జున్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జనవరిలో జారీ చేసిన కనీస వేతనాల ప్రాథమిక నోటిఫికేషన్లు కార్మికుల కనీస వేతనాలకు అనుగుణంగాలేవన్నారు. పెరిగిన ధరలను పరిగణలోకి తీసుకోకుండా వేతనాలను నిర్ణయించారన్నారు. కార్యక్రమంలో హమాలీల యూనియన్ నాయకులు నాగేంద్ర, రమేశ్, కాశీం రాంబాబు, అనిల్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ బుకింగ్ ద్వారా ఇసుక సరఫరా



వాహనాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ కృష్ణ ప్రసాద్

అశ్వారావుపేట రూరల్, మార్చి 23: ఆన్‌లైన్ బుకింగ్ ద్వారా ఇసుక విక్రయాలను నిర్వహించనున్నట్లు తహసీల్దారు కృష్ణప్రసాద్ తెలిపారు. మండలంలోని నారాయణపురం పంచాయతీలోని జగన్నాథపురం ఇసుక రీచ్ వద్ద శనివారం ఇసుక ఇన్‌లైన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన ఇసుక పాలసీ విధానం ద్వారా చౌకధరకు ఇసుక లభిస్తుందన్నారు. మండలంలో జగన్నాథపురం ఇసుక రీచ్ ద్వారా ప్రజలకు ఇసుక సరఫరా ఉంటుందన్నారు. ప్రతి రోజూ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇసుక సరఫరా జరుగుతుందన్నారు. నిర్దేశించిన సమయంలో మాత్రమే ఇసుక రవాణ ఉంటుందని, ఇసుక రీచ్ వద్ద ప్రభుత్వం నుంచి సిబ్బందిని ఉంచనున్నట్లు తెలిపారు. ఇసుక పన్ను విధానంలో ఎక్కడనుంచైనా ఇసుక తరలించేందుకు రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారికి మాత్రమే అవకాశం ఉంటుందన్నారు.

కమ్యూనికేషన్ స్కిల్స్‌ను పెంచుకోవాలి



మాట్లాడుతున్న జీవన్ కుమార్

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, మార్చి 23: విద్యార్థులు సబ్జెక్టులలో ప్రావీణ్యంతో పాటు, కమ్యూనికేషన్ స్కిల్‌లో పట్టు సాధించి మెరుగు పరుచుకోవాలని నంది ఫౌండేషన్ ట్రైనర్ జీవన్‌కుమార్ సూచించారు. శనివారం కొత్తగూడెం సింగరేణి మహిళ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) ఆధ్వర్యంలో ఎప్లాయ్‌బులిటీ స్కిల్స్ అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రొఫీషనల్ ఎతిక్స్, ఎఫెక్టివ్ స్పీకింగ్, గ్రూప్ డిస్కర్షన్, ఇంటర్వ్యూ ప్రిపరేషన్ అనే అంశాలపై క్షుణ్ణంగా వివరించారు. అనంతరం విద్యార్థుల యొక్క సందేహాలు, సలహాలను నివృత్తి చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్.శారద మాట్లాడుతూ విద్యార్థులకు ఇలాంటి అవగాహన సదస్సులు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. ఉద్యోగ సాధనకు ఉపయోగపడతాయని ఆకాంక్షించారు.

అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలి



సీడీపీవో రేవతికి వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

పాల్వంచ రూరల్, మార్చి 23: అంగన్‌వాడీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజే. రమేష్, అంగన్‌వాడీటీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ జిల్లా కార్యదర్శి జిలకర పద్మ కోరారు. శనివారం పాల్వంచ ప్రాజెక్టు సీడీపీవో రేవతికి పెద్దమ్మతల్లి గుడి వద్ద జరిగిన ప్రాజెక్టు సమావేశంలో సీఐటీయూ ఆధ్వర్యంలో వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మే నెల అంతా వేసవి సెలవులు ప్రకటించాలని డిమాండ్ చేశారు. నాణ్యతతో కూడిన సెల్‌ఫోన్లు ట్యాబ్‌లు పంపిణీ చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న గ్యాస్ బిల్లులు, ఇంటి అద్దెలు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు దొడ్డ రవి కుమార్, పాల్వంచ పట్టణ కన్వీనర్ కె.సత్య, ప్రాజెక్టు లీడర్స్ లక్ష్మి, అచ్చమ్మ, రమ్య అచ్చి శ్రీదేవి, కృష్ణవేణి, భాను తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



నిర్మాణాలను కూల్చివేస్తున్న అధికారులు

పాల్వంచ టౌన్, మార్చి 23 : పట్టణ పరిధి నవభారత్ ప్రాంతంలో అనుమతి లేకుండా నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలను శనివారం కూల్చివేశారు. మున్సిపల్ అనుమతి లేకుండ చేపడుతున్న ఇంటి నిర్మాణదారులకు నోటీసులు జారీ చేశారు. మున్సిపల్ కమీషనర్ ఎ. స్వామి ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ అధికారి నెల్లూరి సత్యనారాయణ పర్యవేక్షణలో ట్రాక్టర్ డోజర్ సహాయంతో పడగొట్టారు. ఈ కార్యక్రమంలో టీపీఎస్ ఎల్‌వీ రమణి, సిబ్బంది ప్రసన్నకుమార్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలను ముందుగా గమనించాలి

మణుగూరు, మార్చి 23: భద్రతా విభాగంలో పని చేసే ప్రతి ఒక్క కార్మికుడు నాయకుడిలా వ్యవహరిస్తూ పొంచి ఉన్న ప్రమాదాలను గుర్తించి అవి జరగకుండా నివారించాలని డైరెక్టర్ ఆఫ్ ప్యాక్టరీస్ బి. రాజ్ గోపాల్ కోరారు. శనివారం మణుగూరులోని భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లో 53వ జాతీయ భద్రతా వారోత్సవాల ముగింపు వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమానికి రాజ్ గోపాల్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పనిప్రదేశాల్లో నిరంతర పరిశీలన ఉంటే ప్రమాదాలను అరికట్టవచ్చన్నారు. అనంతరం బిటిపిఎస్ సీఈ బిచ్చన్న మాట్లాడుతూ.. పవర్ స్టేషన్‌లో పనిచేసే ప్రతి ఒక్కరు ఉత్పత్తి సాధనతో పాటు భద్రత నియమాలను తప్పకుండా పాటించడం అభినందనీయమన్నారు. అనతరం రక్షణకు సంబంధించి పలు పోటీలను నిర్వహించారు. గెలుపొందిన వారికి ముఖ్య అతిధి, సీఈలు బహుమతులను అందించారు. కార్యక్రమంలో బీటీపీఎస్ ఎస్ఈ, డీఈ, ఇంజనీర్లు, సంఘాల నాయకులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్స్ , బిల్లులను చెల్లించాలి

మణుగూరు , మార్చి 23: రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్పులను, పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధా కర్ డిమాండ్ చేశారు. శనివారం విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ ఎస్టీ, బీసీ విద్యార్థులు స్కాలర్ షిప్పులు రాక అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ విషయంపై చర్యలు తీసుకోవాలని కోరారు.

పౌష్టికాహారమే రక్ష

పినపాక, మార్చి 23: తల్లీ బిడ్డలకు పౌష్టికాహారమే రక్షగా ఉంటుందని ఐసీడీఎస్ సీడీపీవో జయలక్ష్మి తెలిపారు. శనివారం మండలంలోని పినపాక, జానంపేట సెక్టార్లలోని సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు నిర్వహించిన పోషణ పక్వాడ్ కార్యక్రమాల్లో ముఖ్య అతిథులుగా సీడీపీవో జయలక్ష్మి, ఎంపీడీవో రామకృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా గర్భిణీలు, పిల్లలు, తల్లులు తీసుకోవాల్సిన పోషకాహారంపై అవగాహణ కల్పించారు. అనంతరం గర్భిణీలకు సీమంతాలను చేశారు. చిన్నారులకు అక్షరాభ్యాసాన్ని చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఎం సత్యవతి, జీ పద్మ టి భద్రమ్మ, బ్లాక్ కోఆర్డినేటర్ కే నాగేశ్వరరావు, అంగన్‌వాడీ టీచర్లు, తల్లులు పాల్గొన్నారు.

సింగరేణి ఆస్తుల పరిరక్షణకు కృషిచేయాలి

రుద్రంపూర్, (సింగరేణి) మార్చి 23: సింగరేణి ఆస్తుల పరిరక్షణకు సెక్యూరిటీ సిబ్బంది శ్రమించాలని సింగరేణి సీనియర్ సెక్యూరిటి అధికారి జాకీర్‌హుస్సేన్ కోరారు. శిక్షణ పొందిన సెక్యూరిటీ సిబ్బంది అంకిత భావంతో విధులు నిర్వహించాలని పేర్కొన్నారు. శనివారం కొత్తగూడెం ఎస్అండ్‌పీసీ కార్యాలయంలో శిక్షణ పూర్తి చేసుకున్న సెక్యూరిటీ సిబ్బందికి వీడ్కోలు నిర్వహించారు. సింగరేణి ఆస్తుల పరిరక్షణే లక్ష్యంగా సమర్థవంతంగా విధులు నిర్వహించి సంస్థకు మంచి కీర్తిప్రతిష్టలు తీసుకురావాలని అన్నారు. ప్రధానంగా ఖాళీ స్థలాలు కబ్జాకు గురికాకుండ ఎప్పటికప్పుడు నిఘా ఏర్పాటు చేయాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని హెచ్చరించారు. ఈ శిక్షణలో నైపుణ్యం ప్రదర్శించిన పలువురు సెక్యూరిటీ సిబ్బందికి మెమొంటోలు అందచేశారు. అనంతరం స్థానిక జ్యోతి అనాథాశ్రమంలో నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సెక్యూరిటి ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, ఇన్‌స్ట్రక్టర్లు పాల్గొన్నారు.



నిత్యావసరాలను అందజేస్తున్న దృశ్యం

వైభవంగా రామాలయ విగ్రహ ప్రతిష్ఠ ఏర్పాట్లు

మణుగూరు, మార్చి 23: మండలంలోని కూనవరం గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో సోమవారం విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు జరగనున్నాయి. ఈ సందర్భంగా ఆలయాన్ని పలు రంగులతో సుందరంగా తీర్చిదిద్దారు. ఆలయ ప్రాంగణంలో విగ్రహ ప్రతిష్ఠ పూజా కార్యాక్రమాల కోసం ప్రత్యేకంగా యాగశాలను ఏర్పాటు చేశారు.

జైల్లో న్యాయ అవగాహన సదస్సు

భద్రాచలం, మార్చి 23: భద్రాచలంలోని ప్రత్యేక సబ్‌జైల్లో శనివారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ప్రథమశ్రేణి న్యాయమూర్తి కె.సూరిరెడ్డి మాట్లాడుతూ జైలు నుంచి బయటకు వెళ్లాక ముద్దాయి నుంచి మార్పు అనేది వచ్చేలా ప్రవర్తన ఉండాలని ప్రీ న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ ఉపేందర్, న్యాయవాదులు శారద, రమణ, వెంకటేశ్వర్లు, సతీష్ పాల్గొన్నారు.

ఇసుక క్వారీ నిర్వహించలేం

చర్ల, మార్చి 23: చర్ల మండలం పెద్ది పల్లి ఇసుక క్వారీకి చెందిన, మహిళా కమిటీ సభ్యులు శనివారం చర్ల తాహిసీల్దార్ శ్రీనివాస్‌కు వివిధ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ, ఇసుక క్వారీ నిర్వహణలో తీవ్రమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. చర్ల మండలంతో పాటు ఇతర మండలాలకు చెందిన కొంత మంది వ్యక్తులు ర్యాంపు వద్దకు వచ్చి తమను ఇబ్బందికి గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా అయితే తాము క్వారీ నడపలేమని వాపోయారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

వివాదస్పద భూమిలో మొక్కల తొలగింపు

దుమ్ముగూడెం, మార్చి 23: సింగారం రెవెన్యూ గ్రామ పరిధి వివాదస్పద భూమిలో నాటిన పామాయిల్ మొక్కలను రెవెన్యూ సిబ్బంది శనివారం తొలగించారు. ఆరు సర్వే నెంబర్లలోని 31.01 ఎకరాల విస్తీర్ణం గల భూమి విషయంలో ఆదివాసీ, గిరిజనేతర వ్యక్తుల మధ్య కోర్టు వివాదం నడుస్తోంది. తీర్పు వచ్చేంత వరకూ ఇరువర్గాలు భూమిలో ఎటువంటి కార్యకలాపాలు చేయకూడదని అధికారులు గతంలో ఇరువర్గాలకు సూచించారు. గత రెండు రోజుల నుంచి ఆ భూమిలో గిరిజనేతర వ్యక్తులు పామాయిల్ మొక్కలు నాటుతుండగా, సింగారం ఆదివాసీలు ఐటీడీఏ పీఓ, తహసీల్దార్, సీఐలకు ఫిర్యాదు చేశారు. గిర్దావర్లు ఆదినారాయణ, లక్ష్మయ్య సిబ్బంది కలిసి వివాదస్పద భూమిలో మొక్కలు తొలగించారు.

సక్రమంగా అందని ఉపాధి వేతనాలు

దుమ్ముగూడెం మార్చి 23: ఉపాధి వేతనాల చెల్లింపులో తీవ్ర జాప్యం జరుగుతోందని ఏపీఎస్పీ డివిజన్ అధ్యక్షుడు సోందె మల్లు ఆరోపించారు. అచ్యుతాపురం పంచాయతీ పరిధిలో ఉపాధి వేతనాల సమస్యలపై కూలీలతో శనివారం మాట్లాడారు. పెండింగు వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. వేతనాలు లేక ఉపాధి కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన వాపోయారు. కుటుంబాలు అవస్థలు పడుతున్నాయని అన్నారు.

ఎస్‌కేఎం ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన

దమ్మపేట, మార్చి 23: భగత్‌సింగ్, రాజ్‌గురు సుఖదేవ్ వర్ధంతి సందర్భంగా దమ్మపేటలో సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్‌కేఎం) ఆధ్వర్యంలో శనివారం రాత్రి కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతు బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ఐక్యంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. దేశ సంపదనంతా కార్పోరేట్లకు అప్పజెప్పేందుకు బీజేపీ కుట్ర చేస్తుందని ఆరోపించారు. మత పౌరసత్వం ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం సీఏఏ చట్టాన్ని తెచ్చిందని అన్నారు. దీంతో లౌకిక తత్వానికి పెను ప్రమాదం ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేసారు. అంతకు ముందు దమ్మపేట, అర్బన్ కాలని, మల్లారం, వివిధ పార్టీలకు చెందిన సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ (ప్రజాపంథా)లో జిల్లా కార్యదర్శి కెచ్చల రంగారెడ్డి, ముద్దా బిక్షం ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో అమర్లపూడి రాము, తోడెం దుర్గమ్మ, కురసం ముత్యాలరావు, పండూరి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంపై దృష్టిసారించండి

చంద్రుగొండ, మార్చి 23: గర్భిణులు, బాలింతలు పోషకాహారంపై అత్యధిక శ్రద్ధ వహించాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి నిర్మలా జ్యోతి కోరారు. శనివారం చంద్రగొండలో ప్రాజెక్టు పరిధిలోని చంద్రుగొండ, జూలూరుపాడు, అన్నపురెడ్డిపల్లి మండాలాలకు చెందిన గర్భిణులు, బాలింతలు, చిన్నారులతో ఐసీడీఎస్ అధికారులు పోషన్ పక్వాడ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసనలు చేశారు. అనంతరం సీడీపీవో నిర్మలాజ్యోతి మాట్లాడుతూ గర్భిణీసమయం నుంచే మహిళలు పోషకాహారం తీసుకోవాలని కోరారు. అదేవిధంగా బాలింతలు, చిన్నారులకు నాణ్యమైన ఆహారం తీసుకోవాలన్నారు. గర్భిణీ, బాలింత సమయంలో మంచి హారం తీకోవటంవల్ల తల్లీ, బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మూడు మండలాల సూపర్‌వైజర్లు, అంగన్వాడి టీచ్చర్లు పాల్గొన్నారు.

దుమ్ముగూడెంలో..

దుమ్ముగూడెం: పోషణ పక్వాడలో భాగంగా నరసాపురం రైతువేదికలో శనివారం సెక్టార్ లెవల్ పోషణ ఉత్సవాలు నిర్వహించారు. గర్భిణీలు, బాలింతలు తీసుకోవాల్సిన ఆహార నియమాలు, జాగ్రత్తలను సీడీపీఓ నవ్యశ్రీ వివరించారు. సూపర్‌వైజర్లు సహానా, ధనలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు, పోషణ అభియాన్ మౌనిక పాల్గొన్నారు.

అశ్వారావుపేటలో..

అశ్వారావుపేట(టౌన్): గర్భవతులకు, బాలింతలకు, పిల్లలకు పోషకాహారం అందించటం ద్వారా ఆరోగ్యవంతంగా వుంటారని సీడీపీవో రోజారాణి అన్నారు. బీఎస్ఆర్ ఆరేంద్ర, వికలాంగుల కాలనీలలో గల అంగన్‌వాడి కేంద్రాలలో పోషణా పక్వాడ్ కార్యక్రమంలో బాగంగా శనివారం మహిళలకు, గర్భవతులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పిల్లలకు అన్నప్రసాసన చేసి ప్రీస్కూల్ విద్యార్థులను గుర్తించి అంగన్‌వాడి కేంద్రాలలో చేర్పించారు. పోషణ పక్వాడ్ ప్రతిజ్ఞ చేసి ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో రోజారాణి, సూపర్‌వైజర్ విజయలక్ష్మి, అంగన్‌వాడి టీచర్లు వాణి, విజయ,ఉష, రాధ, నాగమణితదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు సీమంతాలు

లక్ష్మీదేవిపల్లి: పోషణ్ పక్వాడ ముగింపు వారోత్సవాల్లో భాగంగా లక్ష్మీదేవిపల్లి మండలంలో పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో రేవతి ఆధ్వర్యంలో గర్భిణీ స్త్రీలకు సీమంతాలు నిర్వహించి, వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బాలింతలు, చిన్నారులు తీసుకోవాల్సిన బలమైన పౌష్టికాహారంపై వివరించారు. అంగన్‌వాడీ టీచర్స్‌తో ఫుడ్‌స్టాల్స్ ఏర్పాటు చేయించి ఆహారంలో తృణధాన్యాల యొక్క ప్రాముఖ్యతన వివరించారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ ఎంపీడీవో విజయభాస్కర్ రెడ్డి, జిల్లా వన్‌స్టాప్ సఖి సెంటరు కో ఆర్డినేటరు శుభ శ్రీ, మహిళా శక్తి జిల్లా కో ఆర్డినేటరు రూపా పాల్గొన్నారు.

భగత్‌సింగ్ ఆశయ సాధనకు కృషిచేయాలి

కొత్తగూడెం టౌన్, మార్చి 23 : బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఉద్యమించిన భగత్‌సింగ్ ఆశయ సాధనకు యువత నడుంబిగించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా పిలుపునిచ్చారు. ప్రాణాలను సైతం లెక్కచేయకుండ పోరాడిన అమరవీరుల ఆశయాలను సాధించాలన్నారు. శనివారం శేషగిరిభవన్‌లో సర్దార్‌భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి సందర్భంగా చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హక్కుల సాధనే లక్ష్యంగా పోరాటాలు నిర్వహించిన అమరవీరులకు నివాళులర్పించడం బాధ్యతగా స్వీకరించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు దమ్మాలపాటి శేషయ్య, కందుల భాస్కర్, వాసిరెడ్డి మురళీ, భూక్యా శ్రీనివాస్, కే. రత్నకుమారి, ఉల్లోజు వెంకట్, షహీన్, విజయలక్ష్మి, సోమయ్య, బాజోజు రవి పాల్గొన్నారు. ప్రగతిశీల యువజన సంఘం ఆధ్వర్యంలో సర్దార్‌భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పీవైఎల్ డివిజన్ కార్యదర్శి జగదీష్ మాట్లాడారు.

జూలూరుపాడులో..

జూలూరుపాడు: భగత్‌సింగ్ వర్ధంతిని ప్రతి ఏడాది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించాలని ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నాగుల్ మీరా కోరారు. శనివారం జూలూరుపాడులో ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ 93వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భగత్‌సింగ్ జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. భగత్‌సింగ్ ఆశయ సాధనకై కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల కార్యదర్శి ఎస్‌కే. చాంద్‌పాషా, నాయకులు నరేష్, సతీష్, కాశీం తదితరులు పాల్గొన్నారు. మండలంలోని అన్నారుపాడు గ్రామంలో పీవైఎల్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల వర్ధంతి సభలను నిర్వహించారు. అనంతరం కొత్తగూడెం డివిజన్ పీవైఎల్ కార్యదర్శి బాణోత్ జగదీష్ మాట్లాడారు.

పాల్వంచ టౌన్..

భగత్‌సింగ్, సుఖదేవ్, రాజ్‌గురుల వర్ధంతిని సీపీఐ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. భగత్‌సింగ్ చిత్రపటానికి సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి పూర్ణచందర్‌రావు పాల్గొన్నారు.